ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 139 శుక్రవారం 08 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 139 Friday 08 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

### మే 20లోగా డబుల్ బెడ్ రూం
## ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో విడుదల చేయాలని పొంగులేటి ఆదేశం
- ఈనెల 20లోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్న మంత్రి
- భూముల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచన
- లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 07 :** ఈనెల 20వ తేదీలోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని మంత్రి సూచించారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సేకరించి వినియోగించని భూముల్లో అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. జిల్లా కలెక్టర్లు దానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇల్లు, నిజమైన భూ యాజమానులకు చట్టపరంగా హక్కులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి నల్గొండ, - మిగతా 2 లో

### పక్కా ప్లాన్ తో
## నాపై హత్యాయత్నం



- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- కరీంనగర్ లో కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ శ్రేణులు
- కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో దాడి చేశారన్న కౌశిక్
- తనను చంపే అవకాశం ఉందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మండిపాటు

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 07 :** కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే - మిగతా 2 లో



2 లో

### హైదరాబాద్‌లో మరో
## మెట్రో అద్భుతం

- భూమి లోపల, పైన, ఆకాశంలో ప్రయాణం!
- హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మాణం
- అండర్‌గ్రౌండ్, ఎలివేటెడ్, భూమిపై వెళ్లేలా వినూత్న డిజైన్
- ఈ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

## ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం

- ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు - భారత సైన్యం
- ఆపరేషన్ సిందూర్‌తో ఆ సందేశమిచ్చామన్న సైన్యం
- ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ త్రివిధ దళాల అధిపతుల సమావేశం



2 లో

### పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి వర్మ తొలగింపు



- మీడియా ముందు కన్నీళ్లు
- నియోజకవర్గ పార్టీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు అధిష్ఠానం కసరత్తు
- మీడియా సమావేశంలో భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమైన వర్మ
- కూటమిలో ఇబ్బందులు రాకుండా తానే కమిటీని కోరానని వర్మ వెల్లడి
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ

**వార్త సంధ్య, అమరావతి, మే 07 :** పిఠాపురం నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించింది. ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యవహారాలను - మిగతా 2 లో

### రక్షణశాఖ మాజీ మంత్రులకు మరణశిక్ష

- మరణశిక్ష విధించిన చైనా కోర్టు
- అవినీతి వ్యవహారంలో వీ ఫెంగే, లీ షాంగ్‌లపై చర్యలు
- లంచాలు తీసుకోవడంతో పాటు ఇవ్వజూపిన కేసులో లీషాంగ్ దోషి
- మరణశిక్ష విధించినప్పటికీ రెండేళ్ల పాటు వాయిదా



2 లో

### కళ్లు తిరగడాన్ని ముందే పసిగట్టే గెలాక్సీ వాచ్

- శాంసంగ్ సంచలన ఆవిష్కరణ
- శాంసంగ్, కొరియా ఆసుపత్రి సంయుక్త పరిశోధనలో కీలక పురోగతి
- స్పృహ కోల్పోవడానికి 5 నిమిషాల ముందే 84 శాతం కచ్చితత్వంతో హెచ్చరిక
- ప్రపంచంలోనే ఒక కమర్షియల్ స్మార్ట్‌వాచ్ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి
- వైద్య రంగంలో పోస్ట్-కేర్ నుంచి ప్రివెంటివ్ కేర్‌కు మార్పు అని తెలిపిన శాంసంగ్



2 లో

## అతుకులు లేని జాతీయ జెండాతో అద్భుతం



- నేతన్నను అభినందించిన మంత్రి లోకేశ్
- అతుకులు లేని జాతీయ జెండాను రూపొందించిన నేతన్న
- పశ్చిమ గోదావరి జిల్లా కళాకారుడు సత్యనారాయణకు అంతర్జాతీయ రికార్డులు
- చేనేత కళాకారుడిని అభినందించిన మంత్రి నారా లోకేశ్
- ఆంధ్రకు గుర్తింపు తేవాలన్నదే తన లక్ష్యమన్న సత్యనారాయణ

**వార్త సంధ్య, అమరావతి, మే 07 :** పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చేనేత కళాకారుడు రుద్రాక్షల రామలింగ సత్యనారాయణను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అశోక చక్రంతో సహా ఎలాంటి అతుకులు లేకుండా ఏక వస్త్రంతో జాతీయ జెండాను రూపొందించి, పలు అంతర్జాతీయ రికార్డులు సాధించినందుకు గాను ఆయనకు ఈ ప్రశంసలు దక్కాయి. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణ మంత్రి లోకేశ్‌తో భేటీ అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరం గ్రామానికి చెందిన సత్యనారాయణ, తన అరుదైన నైపుణ్యంతో ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, "తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఎగురవేసే 6×12 సైజు జెండాను, తర్వాత ఎర్రకోటపై ఎగురవేసే 8×12 జాతీయ జెండాను తయారు చేశా. ఆంధ్రకు గుర్తింపు రావాలన్న ఆకాంక్షతోనే దేశంలోనే అత్యంత అరుదైన ఏకవస్త్ర చేనేత జాతీయ జెండాను రూపొందించా" - మిగతా 2 లో

# నేను కాదు మనం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సింగపూర్ తరహా అభివృద్ధికి ప్రణాళికలు
- క్షేత్ర స్థాయి ఉద్యోగుల అనుభవాన్ని వినియోగించుకోవాలి
- సింగపూర్ ఉత్తమ విధానాలను ఓ జిల్లాలో అమలు చేద్దాం
- టూరిజం అభివృద్ధి చేసిన జిల్లాకు అత్యధిక ఆదాయం
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి వాటిని సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించాలన్న మంత్రులు




**వార్త సంధ్య, అమరావతి, మే 07 :** టీమ్ వర్క్‌తోనే అభివృద్ధి జరుగుతుందని... నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక నుంచి తాను కూడా నేను అనే పదాన్ని పక్కన పెట్టి మనం అనే పదాన్ని ఉపయోగిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చ జరిగింది. దీంట్లో భాగంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయి. సింగపూర్ అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్ గా అభివృద్ధి చేద్దాం. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేపట్టాలి. సింగపూర్ దేశంలో నేను కాదు.. మనం అనే విధానాన్ని అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూడా నేను కాదు మనం అనే విధానాన్నే అవలంభిద్దాం. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా... సంక్షేమ, అభివృద్ధి జరగుతున్నా.. అందరి కృషి వల్లే సాధ్యమైంది. కలిసి కట్టుగా పని చేస్తే... ప్రతి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఓన్ చేసుకుంటే ప్రభుత్వం మరింత - మిగతా 2 లో

# సంపాదకీయం

## గ్రహాలు రాంగ్ రూట్లో వెళ్తే

మన జీవితంలో వేగం పెరిగింది, ప్రయాణాలు పెరిగాయి, కానీ సహనం తగ్గింది. అందుకే రోడ్లపై ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనల్ని ఆపి ఆలోచింపచేయాల్సిన ఆలోచన ఒకటి ఉంది. ఈ విశ్వాన్ని నడిపిస్తున్న సౌర వ్యవస్థలో ఎన్నో యుగాలుగా గ్రహాలు వాటి కక్ష్య దాటి ఢీకొన్న ఘటనలు జరగలేదు. ఎందుకంటే ప్రతి గ్రహం నిర్దేశిత కక్ష్యలోనే ప్రయాణిస్తుంది. సూర్యుడి చుట్టూ తిరిగే ఏ గ్రహమూ తన కక్ష్యను ఎప్పుడూ దాటదు. ఈ క్రమశిక్షణ వల్లే సౌర వ్యవస్థ 4.5 బిలియన్ సంవత్సరాలుగా స్థిరంగా ఉంది.రోడ్‌పై ప్రయాణించేటప్పుడు మన లేన్ డిసిప్లిన్‌లో లోపాలపై గ్రహాలు చెప్పే పాఠాలు కొన్ని మనం గమనించాలి. సౌర వ్యవస్థలో మెర్క్యూరి గ్రహం సూర్యుడి చుట్టూ గంటకు 1,72,440 కి.మీ వేగంతో తిరుగుతుంటే, మన భూ గ్రహం గంటకు 1,07,280 కి.మీ వేగంతోను, నెప్ట్యూన్ గంటకు 19,440 కి.మీ వేగంతోను తిరుగుతున్నాయి. అయినా ఈ గ్రహాలు ఎప్పుడూ తమ కక్ష్యను విడిచి వెళ్ళలేదు. ఒక్క గ్రహం కక్ష్య దాటినా అది మహా విపత్తుకు దారితీస్తుంది. లక్షల కిలోమీటర్ల వేగంతో తిరిగే గ్రహాలు కక్ష్య దాటకుండా పరిభ్రమిస్తుంటే, గంటకు 6080 కిలోమీటర్ల వేగంతో వెళ్ళే మన వాహనాలు మాత్రం నిర్దేశించిన మార్గాన్ని అతిక్రమించి, లేన్లు దాటి ప్రమాదాలకు గురై ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.పరిశోధనల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 18 నుంచి 28శాతం వరకు ప్రమాదాలు లేన్ క్రమశిక్షణ లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. 2023 సంవత్సరానికి రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ డేటా ప్రకారం, భారతదేశంలో మొత్తం రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు: లేన్ క్రమశిక్షణ లేకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్... ఇవే! ఈ కారణాల వల్ల 9,432 మంది మరణించారని తెలుస్తోంది. రోడ్డుపై క్రమశిక్షణ లేకపోవడం, అతివేగం లేదా మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని ఇది స్పష్టంగా గుర్తుచేస్తోంది. మన దేశంలో వాహనదారులు లేన్ మార్చేటప్పుడు సిగ్నల్ ఇవ్వకపోవడం, రాంగ్‌సైడ్ వెళ్ళడం, ఓవర్ టేక్ చేయడానికి తొందరపడటం... ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు కారణాలు. చాలామంది డ్రైవర్లు లేన్ నియమాలను సరిగ్గా పాటించకపోవడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్ సమీపంలో జరిగిన ట్రక్కు ప్రమాదం మనకు గట్టి హెచ్చరిక. ఒక చిన్న లేన్ ఉల్లంఘన వల్ల 19 మంది ప్రాణాలు పోయాయి. ట్రక్కు డ్రైవర్ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లేన్‌లోకి వెళ్ళాడు.ఆ క్షణిక నిర్ణయం ప్రాణాంతకమైంది. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా ఎన్నో జరుగుతున్నాయి. చాలామంది ట్రాఫిక్ సిగ్నల్ కోసం వేచి ఉండలేక వెంటనే ముందుకు వెళ్ళాలని తొందరపడటం, అవగాహన లోపంతో లేన్ మార్కింగ్‌లను పట్టించుకోకపోవడం, సిగ్నల్ ఇవ్వకుండా లేన్ మార్చడం, రాంగ్ సైడ్ వెళ్ళడం ద్వారా సమయం ఆదా చేయాలని భావించడంతోపాటు ట్రాఫిక్ నియమాలు కఠినంగా అమలు కాకపోవటం వంటి కారణాలు రోడ్లను ప్రమాద నిలయాలుగా మారుస్తున్నాయి.కేవలం ట్రాఫిక్ పోలీసులే కాదు, ప్రతి డ్రైవర్ నియమానుసారమైన డ్రైవింగ్‌ను బాధ్యతగా తీసుకోవాలి. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలి. సౌర వ్యవస్థ వంటి సృజనాత్మక ఉదాహరణలు ఉపయోగిస్తూ, అవగాహన కల్పిస్తే మరింత గుర్తుండిపోతుంది. లేన్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలు విధించాలి. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన కెమెరాలు, ఏఐ టెక్నాలజీ ద్వారా పర్యవేక్షణ పెంచాలి. కొత్త వాహనాల్లో లేన్ డిపార్చర్ వార్నింగ్, లేన్ కీపింగ్ అసిస్ట్ వంటి సాంకేతికతలు ప్రమాదాలను తగ్గించేందుకు దోహదపడతాయి.రోడ్డు అనేది అందరి సొంతం. మనం డ్రైవ్ చేసేటప్పుడు మన లేన్‌లో ఉండటం వల్ల మనవే గాక ఇతరుల ప్రాణాలనూ కాపాడినవాళ్ళమవుతాం. ఒక డ్రైవర్ క్రమశిక్షణ పాటిస్తే అది మరొకరికి స్ఫూర్తి అవుతుంది. సౌర వ్యవస్థలో గ్రహాలు ఎప్పుడూ పోటీపడవు. మనం మాత్రం రోడ్లపై పోటీపడుతున్నాం. ఇదే ప్రమాదాలకు కారణం. మన ప్రయాణం సురక్షితంగా ఉండాలి. మన కుటుంబాలు మన కోసం ఎదురు చూస్తున్నాయి. కాబట్టి లేన్ మారేటప్పుడు సిగ్నల్ ఇవ్వాలి, రాంగ్ సైడ్ వెళ్ళకూడదు, వేగాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి, ఇతర డ్రైవర్లను గౌరవించాలి. ఇవి చిన్న విషయాల్లా అనిపించినా, నిజానికి ప్రాణాలను కాపాడే అతిపెద్ద నిర్ణయాలు.సౌరవ్యవస్థ మనకు గొప్ప పాఠం చెబుతోంది. గ్రహాలు తమ కక్ష్యల్లో ఉండటం వల్లే విశ్వం సురక్షితంగా ఉంది. మనం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తే మన రోడ్లు కూడా సురక్షితంగా ఉంటాయి. మనం లేన్‌లో ప్రయాణించడం అనేది ఒక నిర్ణయం కాదు.. అది జీవితం పట్ల గౌరవం, రోడ్లపై క్రమశిక్షణ. అంటే.. జీవితానికి రక్షణ!

# నేను కాదు మనం




**మొదటిపేజీ తరువాయి -** విజయవంతంగా సేవలు అందించగలదు. నేను కాదు మనం అనే విధానాన్ని నాతో ప్రారంభిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఇదే తరహాలో ఆలోచన చేయాలి. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ప్రజలపై ప్రభావం చూపిస్తాయి. గిరిజన ప్రాంతంలో ఉంటూనే పార్వతీపురం, అల్లూరి జిల్లాల్లో అభివృద్ధి వేర్వేరుగా ఉంది. అల్లూరి జిల్లాలో కాఫీ పంటకు విలువ జోడింపుతో జీఎస్డీపీ ఎక్కువగా ఉంది. అభివృద్ధిపై దృష్టి సారించాలి... ప్రగతి సాధనలో కీలకంగా వ్యవహరించాలి. సర్వీస్ సెక్టార్ మరింతగా పెరగాలి. దేశ జీడీపీలో ఏపీ 10 శాతం మేర వ్యవసాయ ఉత్పత్తుల వాటాను కలిగి ఉంది. కొన్ని జిల్లాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ ఉన్నాయి.. వాటికి సంబంధించిన ప్లాంట్లు వస్తే మరింత అభివృద్ధికి ఆస్కారం ఉంది. జీఎస్డీపీ గ్రోత్ విషయంలో కలెక్టర్లు ఎలా పని చేస్తున్నారనే అంశంపై అధ్యయనం చేస్తాం. నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి ఎలా సాధించాలన్నదానిపై జిల్లా కలెక్టర్లు ఆలోచనలు చేయండి. అన్నమయ్య జిల్లా కలెక్టరే దీనికి ఉదాహరణ. బెస్ట్ పాలసీల అమల్లో కలెక్టర్లు పోటీలు పడాలి. రాష్ట్ర స్థాయిలో కలెక్టర్లకు పోటీ పెట్టినట్టే... జిల్లా స్థాయిలో నియోజకవర్గాల మధ్య పోటీ పెట్టండి. ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లకు చాలా అనుభవం ఉంటుంది.. వాళ్ల దగ్గర చాలా సమాచారం ఉంటుంది. క్షేత్ర స్థాయి అధికారులను సమర్థంగా వినియోగించుకుంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది.. సంక్షేమం చక్కగా అందుతుంది... వినూత్నమైన ఆలోచనలను అమలు చేసేందుకు అవకాశం దక్కుతుంది. సూర్యలంక, మంగినపూడి, విశాఖ, శ్రీకాకుళం, మైపాడు తదితర ప్రాంతాల్లో బీచ్ ఫ్రంట్లు అభివృద్ధి చేస్తే స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి. కొత్త జాతీయ రహదారులు కొత్త అవకాశాల్ని సృష్టిస్తాయి... లాజిస్టిక్స్ హబ్ లను ఏర్పాటు చేసుకోవచ్చు... టౌన్ షిప్ లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. విజన్ యూనిట్లను జిల్లా కలెక్టర్లు సమర్థంగా వినియోగించుకోవాలి. గతంలో పెద్ద జిల్లాల్లో 21 నియోజకవర్గాలను పర్యవేక్షించాల్సి వచ్చేది. కలెక్టర్లు జిల్లా పర్యటనకు వెళ్తే ప్రయాణానికే ఓ పూట పట్టేది. ఇప్పుడు ప్రతీ జిల్లా కలెక్టర్ పరిధిలో కేవలం 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. గతంతో పోల్చుకుంటే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. గతానికంటే మెరుగైన పనితీరు కనబర్చడానికి... అభివృద్ధి చేయడానికి, సంక్షేమం అందించడానికి ఇప్పుడు కలెక్టర్లకు అవకాశాలు ఎక్కువ."అని సీఎం వివరించారు.

# కళ్లు తిరగడాన్ని ముందే పసిగట్టే గెలాక్సీ వాచ్

**మొదటిపేజీ తరువాయి -** ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞాన రంగంలో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ సరికొత్త మైలురాయిని అధిగమించింది. ప్రపంచంలోనే తొలిసారిగా, తమ గెలాక్సీ వాచ్‌ను ఉపయోగించి వాసోవేగల్ సిన్‌కోప్ (వి.వి.ఎస్) లేదా ఆకస్మికంగా కళ్లు తిరిగి పడిపోయి స్పృహ కోల్పోయే సమస్యను అత్యంత కచ్చితత్వంతో ముందుగానే గుర్తించగలమని ఆ సంస్థ ప్రకటించింది. దక్షిణ కొరియాలోని చుంగ్-ఆంగ్ యూనివర్శిటీ గ్వాంగ్‌మయాంగ్ హాస్పిటల్‌తో కలిసి నిర్వహించిన క్లినికల్ అధ్యయనంలో ఈ విజయం సాధించినట్లు మే 7న వెల్లడించింది. ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'యూరోపియన్ హార్ట్ జర్నల్ డిజిటల్ హెల్త్'లో ప్రచురితమయ్యాయి.అధిక ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల గుండె స్పందనల రేటు, రక్తపోటు ఒక్కసారిగా పడిపోయినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ తగ్గి తాత్కాలికంగా స్పృహ కోల్పోవడాన్ని వాసోవేగల్ సిన్‌కోప్ అంటారు. సాధారణంగా ఇది ప్రాణాంతకం కానప్పటికీ, అకస్మాత్తుగా కింద పడిపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలు కావడం, ఎముకలు విరగడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా జీవితకాలంలో దాదాపు 40 శాతం మంది ఈ సమస్యను ఎదుర్కొంటారని, వీరిలో మూడింట ఒక వంతు మందికి ఇది పదేపదే పునరావృతమవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో ముందస్తు హెచ్చరిక ఎంతో కీలకం.ఈ పరిశోధన కోసం వి.వి.ఎస్ లక్షణాలు ఉన్న 132 మంది రోగులపై ఇండ్యూస్డ్ ఫెయింటింగ్ (ప్రేరేపిత మూర్ఛ) పరీక్షలు నిర్వహించారు. ఈ సమయంలో గెలాక్సీ వాచ్‌లోని ఫోటోప్లెతిస్మోగ్రఫీ సెన్సార్ ద్వారా వారి హార్ట్ రేట్ వేరియబిలిటీ డేటాను నిరంతరం సేకరించారు. అనంతరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గారిథమ్‌తో ఈ డేటాను విశ్లేషించారు. ఈ విశ్లేషణలో, రోగి స్పృహ కోల్పోవడానికి 5 నిమిషాల ముందు 84.6 శాతం కచ్చితత్వంతో ముందస్తు హెచ్చరిక ఇవ్వగలమని ఫలితాలు రుజువు చేశాయి.ఈ విజయంపై చుంగ్-ఆంగ్ యూనివర్శిటీ హాస్పిటల్ కార్డియాలజీ విభాగం ప్రొఫెసర్ జున్‌హ్వాన్ చో మాట్లాడుతూ.. "ముందస్తు హెచ్చరిక అందడం వల్ల రోగులు వెంటనే సురక్షితమైన ప్రదేశానికి వెళ్లడానికి లేదా సహాయం కోరడానికి సమయం దొరుకుతుంది. దీనివల్ల ప్రమాదవశాత్తు జరిగే గాయాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని వివరించారు.శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ హెల్త్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ (=&ఆ) గ్రూప్ హెడ్ జాంగ్‌మిన్ చోయి మాట్లాడుతూ, "ఈ అధ్యయనం ఆరోగ్య సంరక్షణను 'పోస్ట్-కేర్' (జరిగాక తీసుకునే జాగ్రత్త) నుంచి 'ప్రివెంటివ్ కేర్' (ముందుజాగ్రత్త) వైపు మార్చడంలో వేరబుల్ టెక్నాలజీ పాత్రకు నిదర్శనం. మా వినియోగదారులు ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు అవసరమైన సాంకేతికతను అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. ఈ విజయంతో డిజిటల్ హెల్త్ రంగంలో తమ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని, వ్యక్తిగతీకరించిన నివారణ ఆరోగ్య పరిష్కారాలను వేగవంతం చేస్తామని శాంసంగ్ పేర్కొంది.

# ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం



**మొదటిపేజీ తరువాయి -** పాకిస్థాన్‌లోని ఏ ఉగ్రవాద స్థావరం సురక్షితం కాదని 'ఆపరేషన్ సిందూర్' నిరూపించిందని, ఇది ముగింపు కాదని కేవలం ఆరంభం మాత్రమేనని భారత సైన్యం వెల్లడించింది. సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌ను శిక్షించడానికి, గత అర్ధ శతాబ్దంలో భారతదేశం చేపట్టిన అత్యంత విస్తృతమైన పోరాట మిషన్‌గా అభివర్ణించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఏడాది పూర్తైన నేపథ్యంలో అందుకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తూ త్రివిధ దళాల అధిపతులు జైపూర్‌లో సంయుక్త పత్రికా సమావేశం నిర్వహించారు.ఆపరేషన్ సిందూర్ ప్రపంచవ్యాప్తంగా సైనిక వ్యూహాలకు కొత్త పాఠంగా నిలిచిందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ మాట్లాడిన జనరల్ రాజీవ్, సమాచార, నిఘా, డ్రోన్, సైన్యం వంటి అన్ని విభాగాల మధ్య అద్భుతమైన సమన్వయం విజయానికి కారమణన్నారు. ఈ ఆపరేషన్‌లో బ్రహ్మోస్, ఆకాశ్‌తో సహా మరెన్నో స్వదేశీ ఆయుధాలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయన్నారు. అత్యంత తక్కువ సమయంలో ఒక సంక్లిష్టమైన ఆపరేషన్‌కు ప్రణాళిక చేసి అమలు చేశామన్నారు. ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని చెప్పారు. ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదని, ప్రారంభమని జనరల్ రాజీవ్ ఉద్ఘాటించారు. "ఆపరేషన్ సిందూర్ జరిగి సరిగ్గా నేటికి ఏడాది పూర్తైంది. అప్పటి డీజీఎంవోగా దీనిని కేవలం ఒక సైనిక చర్యగా మాత్రమే కాకుండా, భారత్ వ్యూహాత్మక ప్రయాణంలో ఒక కీలక ఘట్టంగా భావిస్తున్నాను. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన పాత పద్ధతులు, విధానాలను పక్కన పెట్టి ఖచ్చితత్వం, సమతుల్యత, స్పష్టమైన లక్ష్యంతో నియంత్రణ రేఖ వెంబడి, పాకిస్థాన్‌తో ఉన్న అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఇది ఒక దేశం ప్రదర్శించిన సంకల్పం, బాధ్యత, వ్యూహాత్మక సంయమనానికి నిదర్శనం.'ఆపరేషన్ సిందూర్ వాయుశక్తి ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటిం చిందని అప్పటి వైమానిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్, ఎయిర్ మార్షల్ ఎ.కె. భారతి అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత బలగాలు 13 పాకిస్థానీ విమానాలను ధ్వంసం చేశాయని వెల్లడించారు. 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశామని, దీనికి సంబంధించిన రుజువులు అందరికీ అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. "మే 7న పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేశాము. దానికి సంబంధించిన రుజువులు అందరూ చూసేందుకు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 11 ఎయిర్‌ఫీల్డ్‌లపై దాడి చేశాం. నేలపైన లేదా గాలిలో ఉన్న వారి 13 విమానాలను ధ్వంసం చేశాం. అందులో 300 కిలోమీటర్లకు పైగా రికార్డు దూరంలో ఒక అత్యంత విలువైన వైమానిక ఆస్తిని కూడా కూల్చాం." అని ఆయన అన్నారు. భారత సైనిక లేదా పౌర మౌలిక సదుపాయాలకు ఎలాంటి గణనీయమైన నష్టాన్ని కలిగించడంలో పాకిస్థాన్ విఫలమైందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ పదేపదే చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తోసిపుచ్చారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురువారంతో ఏడాది పూర్తి చేసుకుంది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, మే 7 అర్ధరాత్రి భారత్ ఈ భారీ సైనిక చర్య చేపట్టింది.

# మే 20లోగా డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

**మొదటిపేజీ తరువాయి -** మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశమయ్యారు. ప్రజాప్రతి నిధులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎక్కువ అధికారాలను కలెక్టర్లకే ఇచ్చినట్లు మంత్రి వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులను సకాలంలో విడుదలయ్యేలా చూడాలని కలెక్టర్లకు మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా అర్హులకే ఫలాలు దక్కేలా చూడాలని ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్న భూవివాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమని అన్నారు.నల్గొండ జిల్లా కేంద్రంలో కొత్త రిజిస్ట్రేషన్ ఆఫీసు, నల్గొండ అర్బన్, రూరల్ ఎమ్మార్వో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరగా మంత్రి పొంగులేటి దానికి అంగీకరించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## అతుకులు లేని జాతీయ జెండాతో అద్భుతం



**మొదటిపేజీ తరువాయి -** అని వివరించారు.చేనేత కళపై తనకున్న మక్కువతో అద్భుతమైన జెండాను రూపొందించిన సత్యనారాయణ కృషిని మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కొనియాడారు. ఆయన నైపుణ్యం రాష్ట్రానికి గర్వకారణమని ప్రశంసించారు.

## పక్కా ప్లాన్ తో నాపై హత్యాయత్నం



**మొదటిపేజీ తరువాయి -** పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. ఈ దాడి అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... తనను పక్కా ప్లాన్ తో హత్య చేసేందుకు యత్నించారని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరూ కుమ్మక్కయ్యారని కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. తనపై జరిగిన దాడి వెనుక వీరిద్దరి వ్యూహం ఉందని, ఈ ఘటనతో వారిద్దరూ ఒక్కటేనని తేలిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. తనపై ముందే రెక్కీ నిర్వహించారని, చంపే అవకాశం ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు.బీజేపీ కార్యకర్తలు కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఒక శాసనసభ్యుడికే రక్షణ లేని పరిస్థితి కరీంనగర్‌లో ఉంటే, సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. పట్టణంలో గన్ కల్చర్‌ను ప్రోత్సహించడం సరికాదని, దొంగతనాలను ప్రశ్నించినందుకే తనను టార్గెట్ చేశారని పేర్కొన్నారు. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పడమే తాను చేసిన తప్పా? అని ఆయన ప్రశ్నించారు. తాను రెచ్చగొట్టానని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.

## రక్షణశాఖ మాజీ మంత్రులకు మరణశిక్ష

**మొదటిపేజీ తరువాయి -** ఇద్దరు రక్షణశాఖ మాజీ మంత్రులకు చైనా మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించింది. అవినీతి వ్యవహారంలో వీ ఫెంగే, లీ షాంగ్‌లపై ఈ మేరకు చర్యలు తీసుకుంది. లంచాలు స్వీకరించిన కేసులో వీ ఫెంగే, లంచాలు తీసుకోవడంతో పాటు ఇవ్వజూపిన కేసులో లీ షాంగ్ దోషులుగా తేలారు. కోర్టు వారికి మరణశిక్షను విధించినప్పటికీ, అమలును మాత్రం రెండేళ్ల పాటు నిలిపివేసినట్లు చైనా అధికారిక మీడియా తెలిపింది.వీ ఫెంగే 2018 నుంచి 2023 వరకు చైనా రక్షణ శాఖ మంత్రిగా పని చేశారు. అంతకుముందు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన అత్యంత కీలకమైన రాకెట్ ఫోర్స్‌కు చీఫ్‌గా ఉన్నారు. ఆయన అనంతరం రక్షణ శాఖ మంత్రిగా లీ షాంగ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను స్వయంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఎంపిక చేశారు. కానీ అవినీతి ఆరోపణలపై ఏడాది లోపు తొలగించారు. 2024లో అధికార కమ్యూనిస్టు పార్టీ నుంచి వీరిద్దరిని బహిష్కరించారు. తాజాగా వారికి సైనిక న్యాయస్థానం మరణశిక్ష విధించింది.

## పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి వర్మ తొలగింపు



**మొదటిపేజీ తరువాయి -** పర్యవేక్షించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఏర్పాటుపై టీడీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది.ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పిఠాపురంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తనను ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందిస్తూ, కన్నీళ్లు ఆపుకోలేక ప్రెస్ మీట్ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. అంతకుముందు వర్మ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకే పనిచేశానని, పార్టీ బలోపేతం కోసమే కృషి చేశానని, ఎన్నడూ వ్యతిరేకంగా పనిచేయలేదని అన్నారు. పిఠాపురంలో ఎన్డీయే కూటమిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే, పార్టీ వ్యవహారాల నిర్వహణకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తానే స్వయంగా మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు వర్మ సంచలన విషయం వెల్లడించారు.తాను ఒక్కడినే అన్ని పనులు చూడటం కష్టంగా ఉందని, అందుకే కమిటీ వేయమని అడిగానని, ఈ నేపథ్యంలోనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని తన అనుచరులకు వర్మ వివరించినట్లు సమాచారం. కొన్ని రాజకీయ పరిణామాల దృష్ట్యా పార్టీలో మార్పులు సహజమని, అధిష్ఠానం పార్టీ శ్రేయస్సు కోసమే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. పిఠాపురంలో పార్టీని నేతలే నడిపిస్తారని, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.మొత్తం మీద పిఠాపురం వంటి కీలక నియోజకవర్గంలో వర్మను బాధ్యతల నుంచి తప్పించడం ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏర్పాటు చేయబోయే కమిటీలో వర్మకు స్థానం కల్పిస్తారా? లేదా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## హైదరాబాద్‌లో మరో మెట్రో అద్భుతం



**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల పొడవైన కొత్త కారిడార్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని నిర్ణయించింది. ఈ మార్గాన్ని మూడో దశ కింద చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేంద్రానికి విజ్ఞప్తి చేయడంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది. ఈ కారిడార్ నిర్మాణం ప్రత్యేకంగా ఉండనుంది. ప్రయాణ సమయాన్ని 40 నిమిషాలకు పరిమితం చేసేలా భూమి లోపల (అండర్‌గ్రౌండ్), పిల్లర్లపై (ఎలివేటెడ్), నేలపై (ఎట్-గ్రేడ్) వెళ్లేలా మిశ్రమ పద్ధతిలో డిజైన్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి కార్గో వరకు 2 కిలోమీటర్లు అండర్‌గ్రౌండ్‌లో, ఆ తర్వాత మన్సాన్‌పల్లి, పెద్ద గోల్కొండ, రావిర్యాల ఎగ్జిట్‌ల మీదుగా 20 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ మార్గంలో మెట్రో ప్రయాణిస్తుంది.ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం, రావిర్యాల ఎగ్జిట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 18 కిలోమీటర్ల దూరం భూమిపైనే రైలు పరుగులు పెట్టనుంది. ఇందుకోసం హెచ్ఎండీఏ నిర్మించనున్న 100 మీటర్ల వెడల్పు గల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్ల స్థలాన్ని మెట్రోకు కేటాయించారు. ఈ మార్గంలో మొత్తం 16 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.వాస్తవానికి, మెట్రో రెండో దశలోని ఐదు కారిడార్ల డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హామీా) నాలుగు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఈ ఎయిర్‌పోర్ట్-స్కిల్ వర్సిటీ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రమంత్రి ఖట్టర్‌ను కోరడం ప్రభుత్వ ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రూ.39 లక్షల విలువైన నూతన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తి**

**జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 07(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన అన్ని సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సి-ఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్, హీటింగ్ ప్యాడ్, చెస్ట్ వైబ్రేటర్, రూట్ కెనాల్ చికిత్సకు అవసరమైన ఎండోమోటర్, మైక్రోమోటర్ హ్యాండ్ పీస్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శ్రీధర్, వైద్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఇంటర్ బోర్డు విలీనంపై ప్రభుత్వం పునరాలోచించాలి

**ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల తిరుమల్**



**మంథని, మే 07(వార్త సంధ్య) :** తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డును విద్యాశాఖలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం ఒక్కసారి పునరాలోచన చేయాలని తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల తిరుమల్ ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేకంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక బోర్డు ఉండటం వల్లనే జాతీయ స్థాయి పరీక్షల్లో తెలుగు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ మార్పుల వల్ల అటు విద్యార్థులు, ఇటు ఇంటర్ వ్యవస్థ లో పని చేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్లు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతారన్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించిన బోర్డు వెంటనే దానిని రద్దు చేయడం తగదన్నారు. పాఠశాలల్లో కళాశాలలను విలీనం చేయడం వల్ల అనేక రకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని విలీనం పై మరోసారి మేధావులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## అటవీ శాఖలో అవినీతి బాగోతం బట్టబయలు

**చెట్లు దెబ్బతిన్న కేసు మాఫీకి రూ.10 లక్షల డిమాండ్....!**

**ఎఫ్‌డీఓ సుజాత డీఆర్ఓ కృష్ణయ్యల అవినీతి దందా**

**ప్రజలను భయపెట్టి డబ్బుల వసూళ్లు.**

**అటవీ శాఖ అధికారుల అసలు రంగు బయటపడింది**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 07 (వార్త సంధ్య) :** జిల్లాలో అటవీ శాఖలో అవినీతి మరోసారి వెలుగులోకి వచ్చింది. రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా చెట్లు దెబ్బతిన్న ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసిన భద్రాచలం అటవీ శాఖ ఎఫ్‌డీఓ సుజాత, చర్ల ఇంచార్జ్ డీఆర్ఓ కృష్ణయ్యలు ఏసీబీ వలలో చిక్కారు. గురువారం భద్రాచలం అటవీ శాఖ కార్యాలయంలో రూ.3.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ నేతృత్వంలోని అధికారులు దాడి చేసి ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రోడ్డు వేస్తున్న సమయంలో కొన్ని చెట్లు పొరపాటున దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు ఎఫ్‌డీఓ సుజాత భారీగా లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. లంచం వ్యవహారంలో డీఆర్ఓ కృష్ణయ్య కూడా భాగస్వామిగా వ్యవహరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర ఆధారాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదే జిల్లాలో గతంలో కూడా అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి రూ.3.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటన సంచలనం రేపింది. వరుసగా వెలుగులోకి వస్తున్న అవినీతి ఘటనలతో అటవీ శాఖపై ప్రజల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**24 గంటల ఉచిత కరెంట్, గృహజ్యోతి, సోలార్ ప్రాజెక్టులపై అవగాహన**

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**రైతులకు సబ్సిడీ రుణాలు, యాంత్రికరణ పరికరాల పై వివరాలు**

**గుండుగులపల్లిలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 07 (వార్త సంధ్య) :** గుండుగులపల్లి రైతువేదికలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన సమావేశానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, సబ్సిడీ రుణాలు, యాంత్రికరణ పనిముట్ల పంపిణీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న గృహజ్యోతి, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, నూతన సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల ప్రయోజనాలను వివరించి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, జిల్లా విద్యుత్ అధికారి మహేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్రరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 72 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే-07( వార్త సంధ్య ) :** ధర్మపురి శాసన సభ్యులు, సంక్షేమ శాఖ మంత్రి అడూరి లక్ష్మణ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదు మేరకు ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారు సర్వే నెం. 679లో జరిగిన చట్టవిరుద్ధ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 16.05.2025న సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ దివిజనల్ అధికారి, పెద్దపల్లి ని విచారణ అధికారిగా నియమించగా, వారు సమర్పించిన నివేదికలో సర్వే నెం. 679 మొత్తం 670.22 ఎకరాల ప్రభుత్వ పరంపోగు భూమి అని వెల్లడైనట్లు తెలిపారు. 1347 ఫాసలీ సంవత్సరంలో దేవి పెద్ద లచ్చిగా అనే వ్యక్తికి 72.03 ఎకరాల భూమిపై తాత్కాలిక సాగు అనుమతి మాత్రమే ఇచ్చినట్లు, ఎటువంటి అసైన్మెంట్ జరగలేదని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక అనుమతిని ఆసరాగా చేసుకుని వారి వారసులు అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.బీ అదేవిధంగా ఆ భూములను తదుపరి 11 మంది ఇతరులకు చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు, పట్టా మార్పిడులు చేసినట్లు విచారణలో బయటపడినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం వారి పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారిస్తూ కార్యావర్తనములు నెం. ఈ3/434/2026, తేదీ 27.04.2026 ద్వారా సమాచారం అందజేసి, 72.03 ఎకరాల భూమిని ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. తదనంతరం ఆ భూమిని తహశీల్దార్, ధర్మారం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా, అక్రమ రిజిస్ట్రేషన్లు లేదా పట్టా మార్పిడులు చేసుకుని ఉన్నా, ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఉన్నా స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

## 200 అడుగుల రహదారి విస్తరణను విరమించుకోవాలి

**మల్కాజిగిరి కమిషనర్‌కు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మెమోరాండం**

**వందలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం**

**అవసరమైన చోట్లే ఫ్లైఓవర్లు నిర్మించాలని సూచన**

**ప్రస్తుతం ఉన్న 150 అడుగుల రహదారి ట్రాఫిక్‌కు సరిపోతుందన్న ఎమ్మెల్యే**

**ప్రజల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి**





**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 7 (వార్త సంధ్య):** టికేఆర్ కమాన్ నుండి ఓవైసీ జంక్షన్ వరకు ప్రతిపాదిత 200 అడుగుల రహదారి విస్తరణ మరియు 6 లేన్ ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో స్థానిక ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని, ఆ ప్రతిపాదనను ప్రస్తుతానికి విరమించుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కు మెమోరాండం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో జరిగిన 150 అడుగుల రహదారి విస్తరణలోనే అనేక కుటుంబాలు తమ ఇళ్లను పూర్తిగా లేదా భాగంగా కోల్పోయాయని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి 200 అడుగుల విస్తరణ చేపడితే వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోచమ్మగడ్డ, మారుతి నగర్, న్యూ మారుతి నగర్, కాటికొంకుంట, సత్యనగర్, మయూరిపురం కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 272 నుండి 300 ఇళ్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 150 అడుగుల ఇన్నర్ రింగ్ రోడ్ ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తోందని, ఇప్పటికే ఫ్లైఓవర్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, కానీ అవసరం ఉన్న ప్రాంతాల్లోనే ఫ్లైఓవర్లు నిర్మించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యంగా బండ్లగూడ ఆనంద నగర్ చౌరస్తా, హస్తినాపురం చౌరస్తా వంటి తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవి ముదిరాజ్, చలమల యాదిరెడ్డి, శ్రీనాథ్, కనకేష్, అలాగే కాలనీవాసులు నవరత్నం, నర్సింహ చారి, జగదీశ్, శ్యామ్, శ్రీనివాస్ సాగర్, సుఖ్ జీవన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సమీర్, గౌస్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాల స్కీమ్ క్రింద నమోదు చేసుకొనుటకు మే 11 లోపు ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేయాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్**

**మే 12 లోపు ఆన్ లైన్ దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు**

**జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలి**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 07(వార్త సంధ్య) :** 2026-27 సంవత్సరానికి రెప్యూటెడ్ (కార్పొరేట్) జూనియర్ కళాశాల స్కీం క్రింద నమోదు చేసుకొనుటకు జూనియర్ కళాశాలలు ఆన్ లైన్ లో మే11లోపు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరమునకు కార్పొరేట్ జూనియర్ కళాశాలల స్కీం క్రింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థిని, విద్యార్థులకు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు కల్పించుటకు గాను, పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుండి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలను నూతనముగా ఎంపిక చేయుటకు రెసిడెన్సియల్ వసతి కలిగిన, విద్యా బోధన లో ఉన్నత ప్రమాణాలు కలిగి, కాంపిటేటివ్ పరీక్షలలో ఎక్కువ సంఖ్య ఉత్తీర్ణతా శాతము కల్గినటువంటి జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు.

ఆసక్తి గల కళాశాలలు తమ కళాశాలల యొక్క 5 సంవత్సరాలకు సంబంధించిన అకాడమిక్ ప్రొఫైల్ తో పాటుగా ఈ-పాస్ వెబ్ సైట్ (https:// telanganae pass. cgg.gov.in) ద్వారా తమ కళాశాలల యొక్క ఈపాస్ యూజర్ ఐడి, పాస్ వర్డ్ తో లాగిన్ అయి మే 11 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సదరు కళాశాలలు ఆన్ లైన్ లో రిజిస్టర్ చేసుకున్న తరువాత తమ దరఖాస్తులకు కళాశాల యొక్క బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అనుబంధ ధృవీకరణ పత్రం, భవనము, హాస్టల్ వసతి వివరాలు, క్లాసు రూమ్స్ , డార్మిటరీ వివరాలు, అకాడమిక్ రికార్డు, (ఇంటర్మీడియట్ రిజల్ట్ లో కళాశాల ఉత్తీర్ణతా 90 శాతం, మొదటి శ్రేణిలో 50 శాతం ఉత్తీర్ణతా కలిగి ఉండాలి), ఐ.ఐ.టి/జె.ఇ.ఇ./ ఎ.ఇ.ఇ.ఇ.ఇ/ యం.సెట్ కాంపిటేటివ్ పరీక్షలో సాధించిన ఫలితాల వివరాలు, ఫ్యాకల్టి వివరాలు ( సీనియారిటి వివరాలు), కళాశాల యొక్క ల్యాబ్ , లైబ్రరీ వివరాలను జతచేసి మే12 సాయంత్రం 5 గంటల లోగా పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ

కార్యాలయంలో సమర్పించాలని అన్నారు.ఎంపిక కాబడిన కళాశాలలో చదువుచున్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు క్రింద ప్రతి విద్యార్థికి 35 వేల రూపాయలు, ప్రతి విద్యార్థికి పాకెట్ మనీ క్రింద 3 వేల రూపాయలు ప్రతి సంవత్సరం మంజూరు చేయబడుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

## సర్వే నెం.817 భూ సమస్యలపై పోరాటానికి శ్రీకారం

**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని స్థానికుల డిమాండ్**

**బాధితులకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పణ**

**మంత్రి పొంగులేటిని కలిసి బాధితులకు న్యాయం కోరిన కార్పొరేటర్ నూకల సరిత**

**సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 07 (వార్త సంధ్య) :** సర్వే నెం.817కు సంబంధించిన భూ సమస్యలను సత్వర పరిష్కారం చేయాలని కోరుతూ 5వ డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 817 పరిధిలో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజలు నివాస హక్కులు, పట్టాల జారీ, రికార్డుల సవరణ, భూ హక్కుల నిర్ధారణ వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల సామాన్య ప్రజలు మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నారని కార్పొరేటర్ నూకల సరిత వివరించారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తమ భూములపై పూర్తి హక్కులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని ఆమె మంత్రికి వివరించారు. ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. భూ వివాదాల కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిలిచిపోతున్నాయని, ప్రజల్లో అనిశ్చితి నెలకొన్నదని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమస్యను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం స్పందిస్తుందని మంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బాధిత కుటుంబాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ పరిశీలనలో ఉంది

**ఎంపీ వద్దిరాజు వినతికి స్పందన**

**ప్రత్యుత్తరం రాసిన రైల్వే మంత్రి వైష్ణవ్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 07 (వార్త సంధ్య) :** భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేసే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉపనేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు రాసిన లేఖలో రైల్వే డివిజన్ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ ఏర్పడి వందేళ్లకు చేరువవుతున్న సందర్భంగా, దాని చారిత్రక నేపథ్యాన్ని వివరిస్తూ.. కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు ఎంపీ రవిచంద్ర వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం నుంచి కిరండోల్, మల్కాన్ గిరి, కొవ్వూరు రైల్వే లైన్లు ఏర్పడితే తెలంగాణ, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుందని ఆయన మంత్రికి వివరించారు. ఈ వినతికి స్పందించిన అశ్విని వైష్ణవ్ ఈ సూచనను రైల్వే ఉన్నతాధికారుల పరిశీలనకు పంపామని, పూర్తికాగానే తదుపరి చర్యలు చేపడతామని కేంద్రమంత్రి ఎంపీ రవిచంద్ర కు రాసిన ప్రత్యుత్తరంలో బదులిచ్చారు.

## పెద్దపల్లి జిల్లాకు చెందిన తండ్రి-కొడుకుల ఘనత



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 05(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ ఇంటర్నేషనల్ మౌంటనీర్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ లెంకల మహిపాల్ రెడ్డి తన కుమారుడు లెంకల వివేకానంద రెడ్డితో కలిసి 2026 మే 2న ఆస్ట్రేలియా ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయిన మౌంట్ కోసియాస్కో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించారు. పర్వత శిఖరంపై వారు "ఘఖఎ చీశ ఎశ ణతీబస్త్రం" అనే బ్యానర్‌ను ఆవిష్కరించి, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సందేశాన్ని ఇచ్చారు. ఇదివరకు కూడా వీరిద్దరూ రష్యాలోని యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తండ్రి-కొడుకులిద్దరినీ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని పర్వతాలను అధిరోహించి రాష్ట్రం మరియు దేశానికి మరింత కడ

## 11వసారి రక్తదానం చేసిన గొల్లమందల మురళి..



**తిరువూరు,మే07(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** తిరువూరు పట్టణ పరిధిలోని స్థానిక బోస్ బొమ్మ సెంటర్ మేఘన హాస్పిటల్ నందు రాజుపేట సీతామాలక్ష్మి కాలనీ చెందిన కొలికిపోగు భాగ్యమ్మ రక్త శాతం తక్కువగా ఉండి చికిత్స పొందుతుంది ఆమెకు అత్యవసరంగా ఓ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ అవసరం కాగా తిరువూరు హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ మద్దిబోయిన నరేష్ నీ ఫోన్లో సంప్రదించారు వెంటనే స్పందించిన నరేష్ గ్రూపు సభ్యులైన గొల్లమందల మురళి ( బజాజ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్) కి తెలపగా క్షణాల వ్యవధిలో హాస్పిటల్ కి వచ్చి బ్లడ్ డొనేట్ చెసారు.ఈ కార్యక్రమంలో సమైక్య ప్రెస్ క్లబ్ మరియు హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్, గ్రూపు సభ్యులు మాదాసు టైటాస్, టి. కిషోర్ కుమార్ , కృష్ణ, లక్ష్మి, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.అత్యవసర సమయంలో ఫోన్ చేసిన వెంటనే క్షణాల వ్యవధిలో హాస్పటల్ కి వచ్చి బ్లడ్ డొనేట్ చేసిన మురళి కి భాగ్యమ్మ కుటుంబ సభ్యులు మరియు హాస్పిటల్ డాక్టర్ మురళీకృష్ణ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వార్త సంధ్య
vaartha sandhya
తెలుగు దిన పత్రిక
RNI TGTEL/25/A5065



## మే 11 నుండి 17 వరకు జిల్లాలో విద్యా వారోత్సవాలు

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 07(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మే 11 నుండి 17 వరకు "ఎడ్యుకేషన్ వీక్ " (విద్యా వారోత్సవాలు) ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి, పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు.వారోత్సవాల వారీగా నిర్వహించే కార్యక్రమాలు వివరాలు... మే 11 (మొదటి రోజు): ఫౌండేషన్ డే & సమ్మర్ క్యాంపులు – ఎంపిక చేసిన పీఎం శ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపుల ప్రారంభం. మే 12 (రెండవ రోజు): ఎస్ఎస్సి రెమెడియల్ క్యాంపులు – పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు.మే 13 (మూడవ రోజు): సర్పంచుల సదస్సు – పాఠశాలల అభివృద్ధిపై స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం.మే 14 (నాల్గవ రోజు): ఆయకట్ట బడి బాట & పీటీమ్ – తల్లిదండ్రుల సమావేశాలు, కొత్త అడ్మిషన్ల నమోదు.మే 15 (ఐదవ రోజు): లైబ్రరీ డే – "లైబ్రరీస్: ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్" పేరుతో పుస్తక ప్రదర్శనలు, రీడింగ్ క్లబ్ల ఏర్పాటు. మే 16 (ఆరవ రోజు): ఆర్ట్స్, క్రాఫ్ట్స్ ,కల్చరల్ డే – విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, బొమ్మల తయారీ పోటీలు.మే 17 (ఏడవ రోజు): విద్యా విజయోత్సవం – ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ పాఠశాలలకు బహుమతుల ప్రధానోత్సవం. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంటేషన్ వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి పంపాలని ప్రధానోపాధ్యాయులకు డిఈఓ సూచించారు. ఈ విద్యా వారోత్సవాల్లో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## బోధనేతర సిబ్బంది బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 07( వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ , ఆఫీస్ సబార్డినేట్ బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద గురువారం ఒక ప్రకటన తెలిపారు. 01.01.2026 నాటికి 3 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు, 31.12.2025 నాటికి ఒకే చోట 4 సంవత్సరాల సర్వీస్ నిండిన వారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన సిబ్బంది మే 08 నుండి 15 మే వరకు schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో అప్లై చేసిన దరఖాస్తు కాపీతో పాటు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన సర్వీస్ రిజిస్టర్ జిరాక్స్ కాపీ మే15 సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని, జిల్లాలోని అర్హులైన బోధనేతర సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కిడ్ల పరంజ్యోతి కి సంతాపం

### మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, తలమల్ల హసేన్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే. 7 :** తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి గిడ్ల పరంజ్యోతి మూడు దశాబ్దాలుగా మాల మహానాడు ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి, ఉద్యమానికి అంకితభావంతో సేవలందించారు. ఆయన పోరాటాలు, త్యాగాలు అనేక మందికి స్ఫూర్తిగా నిలిచాయి.ఉద్యమ సహచరుడు, అత్యంత ఆప్తుడు గిడ్ల పరంజ్యోతి మన మధ్య లేకపోవడం అత్యంత బాధాకరం. వారి మృతికి చింతిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తున్నాము. ఉద్యమ జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకరరావు , మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ లు తెలియజేశారు

## ప్రెస్ క్లబ్‌లో జోరుగా శిక్షణ శిబిరాలు





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే. 7 :** ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం మొదలైంది. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఈసీ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. చెస్, యోగా శిబిరాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్), తెలంగాణ చెస్ సంఘం సహకారంతో చిన్నారులు యోగా, చెస్‌లో మెళకువలు నేర్చుకుంటున్నారు. చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వ్యక్తిగతంగా చిన్నారులకు చదరంగంలో శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే పెయింటింగ్‌లో కూడా శిబిరం మొదలవనుంది.



### అల్లూరు సీతారామరాజు జయంతి సందర్భంగా విగ్రహానికి బిజెపి రాష్ట్రనేత వల్లపు వెంకటేష్ ,ఎఫ్ సి ఐ బోర్డు మాజీ మెంబర్ వరికుప్పల శ్రీనివాస్ లు ఘనంగా నివాళులర్పించారు

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 7 :** అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా విగ్రహానికి బిజెపి రాష్ట్రనేత వల్లపు వెంకటేష్, ఎఫ్ సి ఐ బోర్డు మాజీ సభ్యులు వరికుప్పల శ్రీనివాస్ ఘనంగా నివాళులు అర్పించారు అల్లూరి సీతారామరాజు గురించి వారు వివరించారు ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు

## కామారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం

**వేసవిలో పశువుల సంరక్షణపై అవగాహన కార్యక్రమ పోస్టర్ల ఆవిష్కరణ**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ( వార్తా సంధ్య ) :** తెలంగాణ ప్రభుత్వం వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేసవిలో పశువుల సంరక్షణ, యాజమాన్యంపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. వేసవి కాలంలో పశువులకు తగిన ఆహారం, తాగునీరు, నీడ, ఆరోగ్య సంరక్షణ చర్యలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా 2026 మే 8న జిల్లాలో పశువుల ఆరోగ్య శిబిరాలు, మేలుజాతి పశువుల అభివృద్ధి, కృత్రిమ గర్భాధానం, పశు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం**

**గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో**

**తెలంగాణలో నవశకానికి శ్రీకారం**

**అదనపు ఎమ్మార్వోల నియామకం**

**ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు**

**ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్షలో**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 7 :** ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షల్లో భాగంగా గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ ఛైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరైనా వివిధ కారణాలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్ధిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అర్హులైన పేదలనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు.

**అదనపు ఎమ్మార్వోల నియామకం**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నిటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా , అదనంగా మరో తహశీల్దార్ ను నియమించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

**భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన**

**అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా అభివృద్ధి ప్రణాళికలు**

**'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 7 :** అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ హౌసింగ్ కార్పోరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు,రెవెన్యూ సంబంధిత అంశాలపై జరిగిన సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 7 :** రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,అధికారులు పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రస్తావించిన ప్రధాన అంశాలు...**

1. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త రిజిస్ట్రేషన్ ఆఫీసు కొరకు మంజూరు కోరగా అంగీకరించారు.
2. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎదురుగా గల 70 ఎకరాలలో కొత్త హౌసింగ్ కాలనీ మున్సిపాలిటీ మరియు ఇతర లబ్ధిదారుల కొరకు త్వరితగతిన ప్రతిపాదనలు పంపాలి.
3. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలలో గ్రామకంఠం స్థలంలో ఇండ్లు గల వారికి సరైన డాక్యుమెంట్స్ లేకపోవడం వల్ల వారికి ఇంటి నంబరింగ్ కానీ, ఇంటి రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఇట్టి విషయమై 9,640 ఇండ్లపై డీటెయిల్డ్ రిపోర్ట్ వెంటనే తెప్పించి పరిష్కరించాలి.
4. నల్లగొండ కలెక్టరేట్ పక్కన గల 2 బిహెచ్ కె కాలనీలో గల 552 ఇండ్లకు సంబంధించి ఇతర పెండింగ్ పనుల కొరకు మంత్రి 1కోటి నిధులు మంజూరు చేశారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి,ప్రారంభించాలని కోరారు.
5. పెరుగుతున్న అవసరాల మేరకు జిల్లా కేంద్రంలో అదనపు ఎమ్మార్వో కార్యాలయాలు 1. ఎమ్మార్వో అర్బన్,2. ఎమ్మార్వోరూరల్ మంజూరుకు అంగీకారం.
6. జిల్లా కేంద్రంలో నూతన ఎమ్మార్వో కార్యాలయ సముదాయాల కొరకు..
7. దేవరకొండ/ఆలేరు లాంటి ఎస్టీ జనాభా,తండాలు అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో అదనపు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లేవనెత్తిన అంశాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి,తగు చర్యలకు అంగీకారం తెలిపారు.

## జువెలరీ షాపుల భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన సదస్సు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జువెలరీ షాపుల్లో చోరీలు, దోపిడీలు మరియు సైబర్ మోసాలను అరికట్టడమే లక్ష్యంగా కేపీహెచ్‌బీ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గురువారం కేపీహెచ్‌బీ పరిధిలోని లలితా జువెలరీ షోరూమ్‌లో స్థానిక జువెలరీ షాపుల యజమానులు మరియు సిబ్బందితో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ప్రతి షాపులో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలి అత్యవసర సమయాల్లో పోలీసులను అప్రమత్తం చేసేందుకు పానిక్ బటన్ మరియు శక్తివంతమైన అలారం వ్యవస్థ తప్పనిసరి. పని చేసే ఉద్యోగుల పూర్తి వివరాలను సేకరించి, వారికి పోలీస్ వెరిఫికేషన్ చేయించాలి. ప్రస్తుతం విస్తృతంగా జరుగుతున్న ఫేక్ యూపీఐ పేమెంట్ స్క్రీన్‌షాట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నగదు జమ అయినట్లు నిర్ధారించుకున్నాకే నగలు అప్పగించాలి. షాపు పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలి. నగదు మరియు బంగారాన్ని ఒక చోటు నుండి మరోచోటుకు తరలించే సమయంలో తగిన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలి.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు లేదా అనుమానం వచ్చినప్పుడు వెంటనే డైల్ 100 లేదా 112 కు సమాచారం అందించాలని కోరారు. ప్రతి యజమాని తమ షాపుల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

## కేపీహెచ్‌బీలో వ్యక్తి అదృశ్యం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న కొలంపల్లి నారాయణ గౌడ్ (46) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతంగుడి గ్రామానికి చెందిన నారాయణ గౌడ్, తన భార్య శారదతో కలిసి గత నాలుగు నెలలుగా కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 2లోని క్లాసిక్ మెన్స్ పీజీ హాస్టల్‌లో పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నారు.మే 4వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆయన హాస్టల్ నుండి బయటకు వెళ్లారు.గత కొంతకాలంగా నారాయణ గౌడ్ మానసిక స్థితి సరిగా లేదని, గతంలో కూడా ఇలాగే ఒకసారి వెళ్లి తిరిగి వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువుల ఇళ్లలో మరియు సమీప ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆయన ఆచూకీ లభించకపోవడంతో శారద పోలీసులను ఆశ్రయించారు. పైన పేర్కొన్న వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కారించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి రమేష్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన నేతృత్వంలో కార్పొరేషన్ ద్వారా సమాజ సేవ మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి బండి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పిడికిటి గోపాల్ చౌదరి , మోటేపల్లి రంగమ్మోహన్ చలసాని నలినీకాంత్ మన్నే రవి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కామారెడ్డి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించిన చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి

**మున్సిపాలిటీ కార్యాలయం**

**పట్టణ అభివృద్ధిలో కో-ఆప్షన్ సభ్యుల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు.**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ( వార్త సంధ్య) :** నూతనంగా ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పట్టణ సమస్యల పరిష్కారానికి సభ్యులు కృషి చేయాలని కోరారు. వార్డు కౌన్సిలర్లతో సమన్వయం చేసుకుంటూ, వార్డుల వారీగా ఉన్న పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చొరవ చూపాలని సూచించారు. సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాలని కోరారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికైన సభ్యులకు శాలువాలు కప్పి, పూలమాలలతో చైర్‌పర్సన్ మరియు అధికారులు ఘనంగా గౌరవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు షేర్, సుల్తానా ఆన్వార్, వాజీద్, మజీద్, బబ్లు,ఫాతిమా మజీద్, అఖిల, లలిత చిట్టిబాబు ,కాళ్ళ రాజమణి గణేష్ ,కళ్లెం సావిత్రి సత్యం, గడ్డమీది మహేష్, మోతిలాల్, గంగాధర్ ,అర్షిత, జావీద్, సుల్తానా బేగం యునుస్, సుల్తానా సిద్దిక్, తహాశీనున్నిసా లడ్డు, లావణ్య ప్రసాద్ ,వనిత రామ్మోహన్ మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## అల్లూరి ఆశయ సాధనే యువతకు మార్గదర్శకం





**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు స్ఫూర్తితో యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. గురువారం కేపీహెచ్‌బీలోని అల్లూరి సీతారామ రాజు విగ్రహం వద్ద క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, నార్నె శ్రీనివాస్ రావు, మరియు దేశాల్ మిత్రమండలి సభ్యులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి త్యాగాలు మరువలేనివని, ఆయన చూపిన బాటలో యువత నడవాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్‌కు ఘన సన్మానం తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, పీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ గారిని నేతలు ఘనంగా సత్కరించారు. శేరి సతీష్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, సంజీవ్, కొండల్ రెడ్డి, శ్రీ మైకల్ మరియు దేశాల్ మిత్రమండలి సభ్యులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు, యువత పాల్గొని అల్లూరి సేవలను స్మరించుకున్నారు.

## ఏఎల్‌ఎఫ్, టీఎల్‌ఎఫ్ రికార్డుల ఆడిట్‌కు అర్హత గల ఆడిటర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ**

**రామగుండం నగర పాలక సంస్థతో పాటు మూడు మున్సిపాలిటీల పరిధిలో ఆడిట్ నిర్వహణ**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే-07(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నగర పాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ఏరియా లెవెల్ ఫెడరేషన్ (ఏఎల్‌ఎఫ్ ), టౌన్ లెవెల్ ఫెడరేషన్ (టీఎల్‌ఎఫ్ ) రికార్డులను 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ నిర్వహించేందుకు ఆసక్తి, అర్హత మరియు అనుభవం కలిగిన ఆడిటర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అర్హత గల ఆడిటర్లు తమ పూర్తి వివరాలతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి మే 14 లోగా పెద్దపల్లి జిల్లా పథక సంచాలకులు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. రామగుండం నగర పాలక సంస్థతో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలోని ఏఎల్‌ఎఫ్ , టీఎల్‌ఎఫ్ లకు సంబంధించిన రికార్డుల ఆడిట్ నిర్వహణకు అనుభవం కలిగిన ఆడిటర్లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను పథక సంచాలకులు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్‌ను చరవాణి నంబర్ 9573570099 ద్వారా సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

## కామారెడ్డి పట్టణం రోటరీ క్లబ్ లో ప్లినరి కి ముఖ్య అతిథులుగా హాజరై న వీశ్రీష ప్రొఫెసర్ కోదండరాం

**ఈ సందర్భంగా మీజ కోదండరామ్ మాట్లాడుతు టీజెస్ పార్టీ మే 12 న జలవిహార్ లో నిర్వహించడం జరుగుతుంది.**




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 7 ( వార్త సంధ్య ) :** రాష్ట్ర ప్లినరి లో బీసీ రిజర్వేషన్ లు, నిరుద్యోగ సమస్యలు, రైతంగా సమస్యలు, కార్మికుల సమస్యలు చర్చ జరుగుతుంది రాష్ట్ర ప్లినరి ని విజయవంతం చేద్దాం అని పిలుపునిచ్చారు, అదేవిదంగా కామారెడ్డి జిల్లా సాగు నీరు కోసం కృషి చేద్దాం ప్రాజెక్టులు పూర్తి కావాలి రాబోయే రోజులలో జిల్లాలో పర్యటించి అభివృద్ధి కోసం కృషి చేద్దాం అని కలిసి రావాలని అన్నారు. జిల్లా పార్టీ కమిటీని ప్రకటించడం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి గా రజనీకాంత్,ఉపాధ్యక్షులు గా పూల్సింగ్, లల్సింగ్, కార్యదర్శి లు సంగరాజు,వర్షిత్, సంజీవ్, విజయ్ కుమార్,మహిళా అధ్యక్షులు నాగరాణి ప్రకటించారు.

## వనస్థలిపురంలో జశీగల్ ట్రైన్ మండి బిర్యానీ ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 07:** నగరంలో ఆహార ప్రియులకు ప్రత్యేక రుచులను అందిస్తూ మంచి గుర్తింపు పొందిన జశీగల్ గల్ ట్రైన్ మండి బిర్యానీ తన రెండవ బ్రాంచ్‌ను వనస్థలిపురంలో ఘనంగా ప్రారంభించింది. నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై నిర్వాహకులు రాజుతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనస్థలిపురం ప్రాంతంలో నాణ్యమైన ఆహార సేవలు అందించే సంస్థలు విస్తరించడం సంతోషకర విషయమన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారం అందించడంలో జశీగల్ ట్రైన్ మండి బిర్యానీ ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే ఇలాంటి వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. హైదరాబాద్‌లో మండి బిర్యానీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రెండో బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కుటుంబ సమేతంగా వచ్చి ఆస్వాదించేలా ప్రత్యేక వాతావరణాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వివిధ రకాల మండి, చికెన్, మటన్ స్పెషల్ వంటకాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, , ఆహార ప్రియులు పెద్ద సంఖ్య లో హాజరయ్యారు.

## శ్రీ ద్వారక రెడ్డి ప్యూర్ నెయ్యి స్వీట్స్ వైభవంగా ప్రారంభం




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 07:** నారపల్లిలోని కొర్రెముల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ ద్వారక రెడ్డి ప్యూర్ నెయ్యి స్వీట్స్' దుకాణం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. శుద్ధమైన నెయ్యితో తయారు చేసిన వివిధ రకాల మిఠాయిలు స్పెషల్ బాక్లవా స్వీట్స్, స్పెషల్ కలకండ, అంజీర స్వీట్ మరియు హాట్ పదార్థాలు ఇక్కడ అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్లాట్ నంబర్ 81, శ్రీ శివ శక్తి మందిరం ఎదురుగా ఈ సరికొత్త స్వీట్ షాపును ఏర్పాటు చేశారు. నాణ్యత మరియు రుచికి ప్రాధాన్యత ఇస్తూ, శుభకార్యాలకు ఆర్డర్లు కూడా తీసుకోబడునని మనోహర్ రెడ్డి, తెలిపారు. మరిన్ని వివరాలకు 6281158121 నంబరును సంప్రదించవచ్చు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

## టి.సి.ఎస్ వరల్డ్ 10కె రన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ, తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 07:** బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ స్థాయి టి.సి.ఎస్ వరల్డ్ 10కె రన్ కార్యక్రమంలో మాజీ ఎంపీ, తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ పాల్గొన్నారు. ప్రతిష్టాత్మక టి.సి.ఎస్ వరల్డ్ రన్ బెంగుళూరు రన్ ఈసారి ప్రముఖుల సందడితో మరింత ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్, ఒమార్ అబ్దుల్లా (జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి) , డీకే శివ కుమార్(కర్ణాటక ఉపముఖ్యమంత్రి), మధుయాష్కి గౌడ్ (తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్ ) తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో దారుణం

కట్టుకున్న భార్యను కడదాక తోడుండాల్సిన భర్తనే వారి పాలిట కాలయముడై క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. రాష్ట్రంలో తాజాగా హైదరాబాద్, సూర్యాపేట జిల్లా కోదాడలో అనుమానంతో ఒకరు, కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశంలో తమ భార్యలను హత్య చేసి అంతమొందించడం తీవ్ర కలకలం రేపుతోంది. సూర్యాపేట జిల్లా కోదాడ బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని బాబునగర్‌కు చెందిన మణిదీప్ పెద్దలను ఎదిరించి జగ్గయ్యపేటకు చెందిన శిరీషను ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. మణిదీప్ భార్యపై కోదాడ పట్టణ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశాడు. బుధవారం మధ్యాహ్నం భార్య శిరీష తన పెద్దమ్మతో కలిసి స్టేషన్‌కు రావడంతో ఇరువురికి సీఐ శివశంకర్ కౌన్సిలింగ్ ఇచ్చి మరుసటి రోజు వాయిదా వేశారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బస్టాండ్ ఎదుట టీ స్టాల్ వద్ద ఆటోలో శిరీష కూర్చొని ఉంది. అదునుగా భావించిన మణిదీప్ వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణ రహితంగా కడుపులో పొడిచాడు. స్థానికులు నిలువరించే ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. తీవ్ర రక్త స్రావంతో ఉన్న శిరీషను స్థానికులు కోదాడ ప్రభుత్వాసుపత్రి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శిరీషను క్రూరంగా చంపిన నిందితుడు మణిదీప్ కఠినంగా శిక్షించి తమ కుమార్తెకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు అంటున్నారు. కోపంలో భార్య శిరీషను హత్య చేసిన మణిదీప్ నేరుగా పోలీసులకు లొంగిపోగా ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. "నా ఇల్లు కూలిపోతే మేము అక్కడే మాట్లాడుకుంటున్నాము. నా బిడ్డ పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరింది. నేను రానని చెప్పాను. పిల్లాడిని పట్టుకొని చెట్టుకింద కూర్చొమంటే వచ్చాను. ఇప్పుడు నేను ఏం చేయాలి. నా బిడ్డకు న్యాయం జరగాలి. హైదరాబాద్ సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో కోపోద్రిక్తుడైన భర్త ఆమెను డంబెల్‌తో కొట్టి హత్య చేసిన ఘటన సంచలనంగా మారింది. ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ జిల్లాకు చంద్ర భాను సమల్ , సస్మితా సమల్ దంపతులు ఏడాది నుంచి ఫతేనగర్‌లోని శివశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి చందన్, చందిని ఇద్దరు సంతానం. మే 5వ రాత్రి భార్య ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానించిన భర్త చంద్ర భాను కోపోద్రిక్తుడయ్యాడు. ఇద్దరి మధ్య ఘర్షణ పెరిగి ఆమె తలపై డంబెల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో సస్మితా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి మార్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఘటనపై హత్య కేసు నమోదు చేసిన సనత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం భార్యభర్తల ఆలోచనలు, పనితీరు, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఒకరిపై ఒకరికి అనుమానం, కోపం వల్ల పసిపిల్లలు బలవ్వక తప్పడం లేదని మానసిక నిపుణులు చెబుతున్నారు. భార్యను భర్త, భర్తను భార్య చంపడం వల్ల వారిపై ద్వేషం మాత్రం తీరుతుంది. కానీ ప్రతి పిల్లాడు ఎదుగుతున్న సమయంలో తల్లిదండ్రులు ఇద్దరూ చాలా అవసరం. ఏ ఒక్కరూ లేకపోయిన ఆ వెలతి జీవితాంతం వారిని వేధిస్తుంది. అందుకే దంపతులు చిన్న చిన్న విషయాలకే కఠిన నిర్ణయాలు తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. భార్యభర్తల కంటే కూడా అమ్మనాన్నల స్థానంలో ఉండి ఆలోచించడం వల్ల త్వందరపాటుగా తీసుకునే నిర్ణయాలను ఆపవచ్చని మానసిక నిపుణులు చెబుతున్నారు.

## హయత్‌నగర్‌లో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

**19 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం.. ఆరుగురు అదుపులో**




**హయత్‌నగర్ ప్రతినిధి , మే 07 (వార్త సంధ్య):** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు పెద్ద అంబర్‌పేట్‌లోని పిస్తా హౌస్ వెనుక ప్రాంతంలో పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ రెండు లారీల్లోకి టాటా ఏసీ వాహనం ద్వారా పీడీఎస్ బియ్యం బస్తాలను ఎక్కిస్తున్న సమయంలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల నుంచి చిన్న వాహనాల ద్వారా పీడీఎస్ బియ్యాన్ని సేకరించి, లారీల్లో నింపి మహారాష్ట్రకు అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ ఘటనలో ప్రధాన సరఫరాదారుగా సయ్యద్ ఖాజా నసీర్ (36), ప్రధాన వనరుగా అమీర్ పాషా (32), బడా దోస్త్ వాహన డ్రైవర్ మొహమ్మద్ సాబేర్ (23), లారీ డ్రైవర్లు సిద్ధిక్ భాయ్ (65), కొడేప్ మహేంద్ర (34)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిర్వాహకుడు షేక్ అఖిల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు సుమారు 19 టన్నుల పీడీఎస్ బియ్యం (380 బస్తాలు), అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనం, రెండు లారీలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

# నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టలా

**ఇది దేనికి ఉపయోగపడుతుంది**

**తరచూ జరుగుతున్నసైబర్ నేరాలపై ఫిర్యాదు చేయలేకపోతున్న బాధితులు**

**ఏపీలో ప్రతి 100 మందిలో 85 మంది పరిస్థితి ఇదే**

**జాతీయ సగటుతో పోలిస్తే వెనుకంజలో ఏపీ**



సైబర్ నేరాల బారిన పడినప్పుడు బాధితులు ఫిర్యాదు చేయగలుగుతున్నారా? ఫిర్యాదుల కోసం పెట్టిన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను ఎంతమంది ఆశ్రయించగలుగుతున్నారు? పోర్టల్‌ను ఎంతమంది ఉపయోగించుకుంటున్నారు? నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఇప్పటి వరకు ఎంతమందికి ఉపయోగపడింది? ఎంత మంది ఫిర్యాదులకు జవాబునిచ్చింది? ఇవన్నీ పరిశీలిస్తే మన రాష్ట్రంలో సైబర్ నేరం జరిగితే ప్రతి 100 మంది బాధితుల్లో 85 మంది వరకు అసలు ఫిర్యాదే చేయలేకపోతున్నారు. ఈ మోసాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో, ఎలా ఫిర్యాదు చేయాలో కనీస అవగాహన కూడా లేకపోవడమే అందుకు కారణం. కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'భారతదేశంలో మహిళలు, పురుషులు-2025' పేరిట ఉన్న నివేదికలోని గణాంకాలు ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ ఫిర్యాదుల్లో ఏపీ అట్టడుగున ఉంది. జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ వెనకబడింది. మన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలకు గురైన బాధితుల్లో పురుషులు సుమారు 14.3 శాతమైతే, మహిళలు 8.2 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు. మొత్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లోని బాధితుల్లో సుమారు 11.1 శాతం మంది మాత్రమే సైబర్ నేరాలపై ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో సైబర్ నేరాలకు గురైన బాధితుల్లో పురుషులు 31.8 శాతం, మహిళలు 17.7 శాతం లెక్కన మొత్తం దాదాపు 24.5 శాతం మందే సైబర్ నేరాలపై ఫిర్యాదు చేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తంగా చూస్తే పురుషులు 20.2 శాతం, మహిళలు 11.3 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు. అంటే మొత్తంగా సగటున 15.6 శాతం మందే ఫిర్యాదు చేస్తున్నారు. దేశమంతటా చూస్తే సైబర్ నేరాల బాధితుల్లో సుమారు 17.7 శాతం మందే ఫిర్యాదు చేయగలుగుతున్నారు. రెండేళ్లలో రూ.1,725 కోట్లు మాయం : గత రెండు సంవత్సరాలలో ఏపీ నుంచి సైబర్ నేరాలపై నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు దాదాపు 1.24 లక్షల ఫిర్యాదులు అందగా. అందులో ఎక్కువ మంది బాధితులు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1930 ద్వారానే కాల్ చేసి ఫిర్యాదు చేశారు. ఆయా నేరాల్లో బాధితులు సుమారు రూ.1,725 కోట్లు వరకు పోగొట్టుకున్నారు. వాటిల్లో కేవలం రూ.211 కోట్లు మాత్రమే పోలీసులు సీజ్ చేయగలిగారు. మోసానికి గురయ్యామని తెలిసిన వెంటనే ఎవర్ని సంప్రదించాలి? ఎవరిని ఆశ్రయించాలి? తదితర అంశాలపై బాధితులకు కనీస అవగాహన ఉండట్లేదు. ఆ దిశగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముంది. ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా ఖాతాల హ్యాకింగ్, ఓటీపీ మోసాలు, ఐడెంటిటీ థెఫ్ట్ మొదలైన వాటిపై ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకొని వేధింపులు, అశ్లీల చిత్రాలు/వీడియోలను బట్టి మోసం చేయడం, వారికి ఇబ్బంది కలిగిస్తే అటువంటి వాటిపై కూడా ఫిర్యాదు చేయవచ్చు. వీటిని బాధితులు తమ వివరాలు గోప్యంగా ఉంచి కూడా రిపోర్ట్ చేయవచ్చు. మొదట పోర్టల్ ఓపెన్ చేసి, కంప్లైంట్ ఫైల్ చేసే ఆప్షన్‌ను ఎంచుకుని, నిబంధనలు అంగీకరించాలి. తర్వాత లాగిన్ అవ్వాలి. మీ మొబైల్ నంబర్, ఓటీపీ ఉపయోగించి లాగిన్ అవ్వాలి. అనంతరం జరిగిన మోసానికి సంబంధించిన పూర్తి వివరాలు, సమయం, సాక్ష్యాలు (స్క్రీన్‌షాట్‌లు, లావాదేవీల రసీదులు మొదలైనవి) అప్‌లోడ్ చేయాలి. గమనిక: మీకు అనుమానాస్పదంగా ఉన్న ఫోన్ నంబర్లు, సోషల్ మీడియా అకౌంట్లు, లేదా యూఆర్ఎల్‌లను కూడా పోర్టల్‌లోని అనే విభాగం ద్వారా ముందస్తుగా రిపోర్ట్ చేయవచ్చు. ఏదైనా సైబర్ మోసం జరిగినప్పుడు "వెంటనే" 1930 నంబర్‌కు కాల్ చేయడం లేదా పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం వల్ల మోసగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేసి, మీ డబ్బును తిరిగి పొందే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

# విజయ్ పార్టీకి మద్దతిచ్చేది లేదు

**స్పష్టం చేసిన అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్**

**తమిళనాడులో మొదలైన రిసార్ట్ రాజకీయాలు**

**పుదుచ్చేరి రిసార్టుకు తరలిన పలువురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు**

**ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన ఎమ్మెల్యేల జాబితా ఇవ్వాలని విజయ్‌కు గవర్నర్ సూచన**

**అన్నాడీఎంకే మద్దతు కోరడానికి సుముఖంగా లేని నటుడు విజయ్**





తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతనంగా ఎన్నికైన 12 మందికి పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఒక రిసార్టుకు తరలించడంతో తీవ్ర గందరగోళం మొదలైంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీలో విభేదాలు తలెత్తాయనే ఊహాగానాలకు ఈ పరిణామం బలం చేకూర్చింది. అయితే, ఈ వార్తలను అన్నాడీఎంకే నాయకత్వం తీవ్రంగా ఖండించింది. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని స్పష్టం చేసింది. టీవీకే తమ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే అవకాశం ఉందని, వారిని కాపాడుకోవడానికే రిసార్టుకు తరలించామని వివరణ ఇచ్చింది. "టీవీకేకు అన్నాడీఎంకే ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదు. పార్టీ చీఫ్ ఈపీఎస్ ఆమోదంతో ఈ విషయం ప్రకటిస్తున్నాను" అని సీనియర్ నేత కేపీ మునుసామి స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ పార్టీకి మద్దతుపై పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తొలుత మౌనంగా ఉండటంతోనే ఈ గందరగోళం తలెత్తిందని ఎన్డీటీవీతో అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి. ఆయన మౌనం కారణంగా కొందరు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలని భావిస్తున్నారనే ప్రచారం జరిగిందని అంగీకరించాయి. అయితే, ఇప్పుడు ఈపీఎస్ తన వైఖరిని స్పష్టం చేశారని, టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పడంతో ఎమ్మెల్యేలంతా ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని ఆ వర్గాలు వివరించాయి. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల మ్యాజిక్ ఫిగర్‌కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయింది. దీంతో కాంగ్రెస్ (5), వామపక్షాలు (4), వీసీకే (2) పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో విజయ్ ఉన్నారు. అయితే, బీజేపీతో గతంలో పొత్తు పెట్టుకున్న అన్నాడీఎంకే మద్దతు కోరడానికి విజయ్ సిద్ధంగా లేరని, దానివల్ల భవిష్యత్తులో బీజేపీ ప్రభావం తన ప్రభుత్వంపై పడుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల జాబితాను సమర్పిస్తేనే ఆహ్వానిస్తామని విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ సూచించినట్లు సమాచారం. దీంతో తమిళనాట ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

# వేసవిలో వడదెబ్బతో బీ కేర్ ఫుల్

**నిర్లక్ష్యంతో ప్రాణాలకే ప్రమాదం : వైద్యులు**

**మెదడు, హృదయం, మూత్రపిండాలపై వడదెబ్బ ప్రభావం చూపుతుందంటున్న వైద్యులు**

**లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణుల సూచనలు**

**హీట్ స్ట్రోక్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఐజీ వైద్యులు**



చాలామంది హీట్ స్ట్రోక్‌ను(వడదెబ్బను) సాధారణ నీరసం, డీహైడ్రేషన్ అని అనుకుంటుంటారు. కానీ ఇది మెదడు, హృదయం, మూత్రపిండాలపై వేగంగా ప్రభావం చూపే అత్యవసర పరిస్థితి అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంకేతాలను ముందే గుర్తించి, వెంటనే వైద్య చికిత్స ప్రారంభించాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదమని ఏఐజీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి వివరించారు. రాష్ట్రంలో ఎండలు మండుతున్న వేళ ప్రజలకు వడదెబ్బ (హీట్ స్ట్రోక్)పై అవగాహన కల్పించేందుకు ఏఐజీ ఆసుపత్రి 'బీట్ ది హీట్' కార్యక్రమానికి బుధవారం నుంచి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే వైద్యులు పలు కీలక సూచనలు చేశారు.మనకు జ్వరం వచ్చినప్పుడు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ అనేది పనిచేస్తుంది. చెమట పట్టి వెంటనే కొంతసేపటికి శరీరం చల్లబడుతుంది. హీట్ స్ట్రోక్‌లో(వడదెబ్బ) కారణంగా ఆ వ్యవస్థ మొత్తం విఫలమవుతుంది. ఎండలో ఉన్నప్పటికీ సరే చెమట పట్టదు. ఇది అత్యంత ప్రమాదకర సంకేతమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తొలుత అలసట, తల తిరగడం, వికారం లాంటి లక్షణాలు ఉంటాయి. తర్వాత మాట తడబడటం, గందరగోళం, ఫిట్స్ లక్షణాలు కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పేషెంట్‌ను హాస్పిటల్‌కు తరలించాలి. వేడి వాతావరణంలో ఉన్నప్పుడు ఛాతీలో అసౌకర్యం, ఆయాసం, స్పృహ కోల్పోవడం, తీవ్ర అలసట లక్షణాలు కనిపించినప్పటికీ వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచిస్తున్నారు.హీట్ స్ట్రోక్‌లో తొలి 5 నిమిషాలు అత్యంత ముఖ్యమైన సమయం. అంబులెన్సు కోసం ఎదురుచూడకుండా బాధితుడిని వెంటనే నీడకు తరలించి గాలి తగిలేవిధంగా చేయాలి. తడి వస్త్రంతో శరీరంను తుడవాలి. మెడ, చంకలు, గడ్డల్లో ఐస్ ప్యాక్ పెట్టాలి. హీట్ స్ట్రోక్‌లో శరీరాన్ని కూలింగ్ చేయడమే వైద్యంలో ముఖ్యమైన ప్రక్రియ.విపరీతమైన వేడి కారణంగా గుండెపై భారం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. శరీరాన్ని చల్లబర్చేందుకు గుండె ఎక్కువ అధిక రక్తాన్ని పంప్ చేయాల్సి వస్తుంది. మరోవైపు డీహైడ్రేషన్ కారణంగా శరీరంలో రక్త పరిమాణం మరింత తగ్గి అది కూడా గుండెపై ఒత్తిడి పెంచుతుందని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, ఎండలో పనిచేసే వారు, వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్త తీసుకోవాలి. వైద్యుడిని సంప్రదించకుండా మందులు మానేయడం అంత మంచిది కాదు.



**తప్పక పాటించాల్సిన సూచనలు :**

నీళ్లు తాగుతూ ఉండాలి: దాహం వేసేంతవరకు ఉండకుండా రోజుకు 7-8 గ్లాసుల నీళ్లు తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ లాంటివి కూడా తీసుకోవచ్చు.ఎండకి వెళ్లకపోవడమే మంచిది: ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఎండలోకి వెళ్లకపోవడమే మంచిది.లేత రంగు దుస్తులు: వేసవిలో వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఇవి శరీరాన్ని చల్లగా ఉంచడంలో తోడ్పడతాయి.ఆల్కహాల్ వద్దు: ఆల్కహాల్(మద్యం) శరీరాన్ని వేగంగా డీహైడ్రేట్ చేస్తుంది. మద్యంతో పాటు కెఫీన్ ఉండే పానీయాలకు దూరంగా ఉండటం ఉత్తమం.పార్క్ చేసిన కార్లలో: ఇంటి వద్ద పార్క్ చేసిన కార్లలో పిల్లలను, పెంపుడు జంతువులను అసలు ఉంచకూడదు. అందులో వేడికి వడదెబ్బ తగిలేటువంటి ప్రమాదం ఉంది.చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# బ్రిటీషు వారికి క్షమాపణ చెప్పమని సావర్కర్‌ను గాంధీ కోరారా?





కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరీ రాసిన 'ది న్యూ ఐకాన్ - సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' అనే పుస్తకం ఇటీవల విడుదలైంది. ఈ పుస్తకంలో వీడీసావర్కర్ రచనలను, ఆయన వ్యక్తిత్వాన్ని అరుణ్ శౌరీ నిశితంగా సమీక్షించారు.సావర్కర్ రాసిన పత్రాలు, బ్రిటిషు రికార్డుల ఆధారంగా అరుణ్ శౌరీ ఈ పుస్తకాన్ని రాశారు

**బ్రిటిషు వారితో సావర్కర్**

వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సావర్కర్‌ను దేశభక్తుడు, జాతీయవాది అని బీజేపీ పిలుస్తుండగా, కాంగ్రెస్ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.సావర్కర్ గొప్ప హేతువాది అని, ఆ విషయంలో ఆయనను అభినందిస్తున్నట్లు అరుణ్ శౌరీ తెలిపారు."సావర్కర్ అనేక ఆచారాలను ప్రశ్నించారు, దానికి ఆయనను అభినందిస్తున్నాను. కానీ, ఆయన బ్రిటిషు వారికి సాయం చేశారు" అని అరుణ్ అన్నారు."జాతీయ స్థాయిలో స్వాతంత్ర్యం కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు బ్రిటిషు వారికి సావర్కర్ మద్దతుగా నిలిచారు. బ్రిటిషు వారికి రాజకీయంగా సహాయం చేస్తానని వాగ్దానం చేశారు" అని అరుణ్ శౌరీ చెప్పారు."సావర్కర్ బ్రిటిషు వారి షరతులను అవసరానికి మించి అంగీకరించారు. అవి ఆయనను జైలు నుంచి విడుదల చేయడానికి సంబంధించినవి కూడా కావు. సావర్కర్ వైస్రాయ్ లిన్‌లిత్‌గోను కలిసినప్పుడల్లా, ఆ సమావేశానికి సంబంధించిన పూర్తి రికార్డును లిన్‌లిత్‌గో లండన్‌కు పంపేవారు. ఆ రికార్డులలో 'సావర్కర్ నన్ను రెండుసార్లు వేడుకున్నారు' అని లిన్‌లిత్‌గో రాశారు" అని అరుణ్ తెలిపారు.

**సావర్కర్ క్షమాపణ**

సావర్కర్ రాసిన క్షమాపణలపై అనేక ఊహాగానాలు ఉన్నాయి. వాస్తవానికి, నాసిక్ కలెక్టర్ హత్యలో సావర్కర్ దోషిగా తేలారు. ఆయనపై 25 సంవత్సరాల చొప్పున రెండు వేర్వేరు శిక్షలు విధించారు.ఆ శిక్షను అనుభవించడానికి ఆయనను అండమాన్ (కాలాపానీ)కి పంపారు. జైలుకు వెళ్లిన తర్వాత సావర్కర్ బ్రిటిషు వారికి చాలా క్షమాపణ లేఖలు రాశారు. ఈ విషయంపై పలువురు సావర్కర్‌ను విమర్శించారు.అయితే, బ్రిటిషు వారికి క్షమాపణ చెప్పడాన్ని సావర్కర్, ఆయన మద్దతుదారులు సమర్థించుకున్నారు.అది తమ వ్యూహంలో భాగమన్నారు. దీంతో కొన్ని రాయితీలు పొందవచ్చన్నారు. సావర్కర్ ఇచ్చిన ఈ వివరణను అరుణ్ శౌరీ తన పుస్తకంలో ప్రస్తావించారు.సావర్కర్ క్షమాపణలను శివాజీ వంటి వ్యూహాలుగా అరుణ్ శౌరీ భావించడం లేదు."శివాజీకి (ఔరంగజేబు లేదా ఆయన సైన్యం వల్ల) ఎప్పుడు ఇబ్బందులు ఎదురైనా, దక్షిణాదిని గెలవడానికి సహాయం చేస్తానని ఔరంగజేబుకు ఉత్తరం రాసేవారు. ఔరంగజేబు అక్కడి నుంచి వెళ్లిన వెంటనే, శివాజీ మళ్లీ తన పని తాను చేసుకునేవారు. కానీ, సావర్కర్ బ్రిటిషు వారి వద్ద శివాజీ వ్యూహాన్ని అనుసరించారా? అంటే కచ్చితంగా కాదు. ఆయన బ్రిటిషు వారికి సాయం చేస్తూనే ఉన్నారు" అని అరుణ్ తెలిపారు.



**క్షమాపణ కోరమని గాంధీజీ అడిగారా?**

సావర్కర్ దుష్ప్రచారాలకు బాధితుడని 2021లో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బహిరంగ వేదికపై వ్యాఖ్యానించారు. గాంధీజీ కోరిక మేరకే సావర్కర్ క్షమాపణలు రాశారని ఆయన ఆరోపించారు.దీనిపై అరుణ్ శౌరీ మాట్లాడుతూ "1910లో సావర్కర్‌ని దోషిగా నిర్ధరించిన విషయం ఆయనకు (రాజ్‌నాథ్‌సింగ్‌కు) తెలియకపోవచ్చు. జైలు శిక్ష అనుభవించేందుకు సావర్కర్‌ను అండమాన్‌కు పంపారు. అయితే, ఆయన రెండు నెలల్లోనే క్షమాపణ చెప్పారు. ఆ తర్వాత అనేక క్షమాపణ లేఖలు రాశారు. ఆ సమయంలో గాంధీ దక్షిణాఫ్రికాలో (1910-11) ఉన్నారు. 1915లో గాంధీ భారతదేశానికి తిరిగి వచ్చారు. సావర్కర్ అప్పటికే నాలుగేళ్లు జైలులో ఉన్నారు, ఐదు క్షమాపణలు దాఖలు చేశారు" అని అన్నారు.శౌరీ వివరిస్తూ "రాజకీయ ఖైదీలందరికీ బ్రిటిషు వారు సాధారణ క్షమాభిక్షప్రకటించినప్పుడు సావర్కర్ పేరును అందులో చేర్చలేదు. దీంతో సావర్కర్ తమ్ముడు నారాయణ్ గాంధీజీ సలహా కోరారు. దీంతో సావర్కర్ తన పిటిషన్‌లో తాను రాజకీయ ఖైదీ అని రాస్తే, అప్పుడు ఆయన కూడా క్షమాభిక్ష పరిధిలోకి వస్తారని గాంధీజీ సూచించారు. సావర్కర్ అదే చేశారు. ఆయనతో పాటు జైలులో ఉన్న తన సోదరులు భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకం కాదని హామీ ఇచ్చారు" అని తెలిపారు.

**గాంధీజీకి మిత్రుడా?**

1948లో మహాత్మాగాంధీ హత్యకు గురైన ఆరో రోజున, ఈ హత్యకు కుట్ర పన్నారనే ఆరోపణలపై సావర్కర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఫిబ్రవరి 1949లో ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు.సావర్కర్ ప్రకారం, ఆయన ఒకప్పుడు గాంధీజీకి స్నేహితులు. ఇంతకీ గాంధీజీతో సావర్కర్‌కు ఎలాంటి సంబంధం ఉండేది. ఇద్దరూ స్నేహితులేనా?ఈ ప్రశ్నకు అరుణ్ శౌరీ సమాధానమిస్తూ "అస్సలు కాదు. నిజానికి గాంధీజీని సావర్కర్ అసహ్యించుకున్నారు. గాంధీజీని ఆయన మూరు?డు, పిచ్చివాడనేవారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి అంటుండేవారు. 'నడిచే ప్లేగు' అనేవారు" అని తెలిపారు.

**'హిందుత్వ నుంచి హిందూమతాన్ని కాపాడాలి'**

సావర్కర్ 1923లో 'హిందుత్వ - ఎవరు హిందువు?' అనే పుస్తకం రాశారు. ఇందులో ఆయన తొలిసారిగా హిందుత్వను రాజకీయ సిద్ధాంతంగా ఉపయోగించుకున్నారు.దీనిపై అరుణ్ శౌరి స్పందిస్తూ "సావర్కర్ తను రాసిన పుస్తకంలో హిందుత్వ, హిందూయిజం చాలా భిన్నమైనవని రాశారు" అని తెలిపారు.హిందూమతాన్ని హిందుత్వనుంచి కాపాడాలని శౌరీ 'ది న్యూ ఐకాన్ - సావర్కర్ అండ్ ది ఫ్యాక్ట్స్' పుస్తకంలో విజ్ఞప్తి చేశారు."సావర్కర్ ఆశించిన హిందుత్వం వస్తే ఇక మనది భారతదేశం కాదు, పాకిస్తాన్‌గా మారుతుంది. అది 'కాషాయరంగులోని ఇస్లామిక్ రాజ్యం' అవుతుంది" అని శౌరీ అభిప్రాయపడ్డారు."సావర్కర్ హిందుత్వం క్రూరత్వాన్ని, ద్వేషాన్ని బోధిస్తుంది. ఒక సమాజం అటువంటి విలువలను అవలంబిస్తే హిందూ మతం ఎక్కడ మిగులుతుంది?" అని అరుణ్ శౌరీ ప్రశ్నించారు.

# మామిడి పండు తింటే షుగర్ పెరుగుతుందా

వేసవి కాలం వచ్చిందంటే చాలు, మామిడి పండ్ల సందడి మొదలవుతుంది. అయితే, ఈ పండ్ల తియ్యదనం మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారికి మాత్రం ఆందోళన కలిగిస్తుంది. మామిడి పండు తింటే రక్తంలో చక్కెర స్థాయిలు (షుగర్ లెవెల్స్) అమాంతం పెరిగిపోతాయనే భయంతో చాలామంది వాటికి దూరంగా ఉంటారు. కానీ, ఈ విషయంలో పోషకాహార నిపుణులు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మామిడి పండును సరైన పద్ధతిలో, సరైన మోతాదులో తీసుకుంటే డయాబెటిస్ ఉన్నవారు కూడా దాని రుచిని ఆస్వాదించవచ్చని స్పష్టం చేస్తున్నారు.మామిడి పండులో సహజంగానే చక్కెరలు అధికంగా ఉంటాయి. అందుకే దీనిని 'హై షుగర్ ఫ్రూట్' అని భావిస్తుంటారు. అయితే, ఇందులో కేవలం చక్కెర మాత్రమే కాకుండా మన శరీరానికి మేలు చేసే అనేక పోషకాలు కూడా ఉన్నాయని పోషకాహార నిపుణురాలు దీప్‌శిఖా జైన్ వివరిస్తున్నారు. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు.మామిడి పండులో 'మ్యాంగిఫెరిన్' అనే ఒక ప్రత్యేకమైన పాలీఫెనాల్ ఉంటుంది. దీనికి యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలతో పాటు యాంటీ-డయాబెటిక్



గుణాలు కూడా ఉన్నాయి. ఈ మ్యాంగిఫెరిన్ రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణకు సహాయపడగలదని దీప్‌శిఖా జైన్ పేర్కొన్నారు. అంతేకాకుండా, మామిడి పండు గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) కేవలం 51 మాత్రమే. ఇది తక్కువ నుంచి మధ్యస్థ కేటగిరీ కిందకు వస్తుంది. అంటే, దీనిని తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరగవు. ఇందులో ఉండే ఫైబర్, చక్కెర నెమ్మదిగా రక్తంలో కలిసేలా చేస్తుంది.డయాబెటిస్ ఉన్నవారు మామిడి పండును ఎలా తింటున్నారన్నదే అత్యంత ముఖ్యమైన విషయం. పండును నేరుగా తినకుండా జ్యూస్ లేదా మిల్క్‌షేక్ రూపంలో తీసుకుంటే ఫైబర్ తొలగిపోయి, షుగర్ స్పైక్ అయ్యే ప్రమాదం ఎక్కువ. అలాగే, భోజనంతో పాటుగా లేదా భోజనం చేసిన వెంటనే తినడం కూడా మంచిది కాదు.మామిడి పండును రసంలా కాకుండా, ముక్కలుగా కట్ చేసుకుని నేరుగా తినాలి.భారీ భోజనంతో పాటుగా తినకుండా, స్నాక్‌గా తీసుకోవాలి.పండును తినేటప్పుడు గ్రీక్ యోగర్ట్, నట్స్ వంటి ప్రొటీన్ లేదా ఆరోగ్యకరమైన ఫ్యాట్ ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే, చక్కెర రక్తంలో కలిసే వేగం మరింత తగ్గుతుంది. సో.. డయాబెటిస్ ఉన్నవారు మామిడి పండ్లకు పూర్తిగా దూరం కావాల్సిన పనిలేదు. సరైన మోతాదులో, సరైన పద్ధతిలో తీసుకుంటే ఎలాంటి సమస్యా ఉండదు. ఆహారం గురించి గుడ్డిగా భయపడటం కంటే, దాని గురించి పూర్తిగా అర్థం చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఇష్టం లేని పేరు మార్చుకోవడం ఎలా, చట్టపరమైన ప్రక్రియలు ఏంటి?



చాలామంది రకరకాల కారణాల రీత్యా తమ పేరు మార్చుకుంటూ ఉంటారు. కొందరికి చిన్నప్పుడు పెట్టిన పేరు నచ్చక, మరికొందరికి సర్టిఫికెట్లలో పేరు, తమ పేరు వేరు వేరుగా ఉన్నందున, ఇంకొందరు జాతకం ప్రకారం, మరికొందరు సంఖ్యాశాస్త్రం మేరకు, కొందరు పెళ్ళయ్యాక, విడాకుల తరువాత, మతం మార్చుకున్నప్పుడు, తమ పేర్లపై సమాజంలో ఉన్న వ్యతిరేకత కారణంగా, ఇలా అనేక కారణాలతో పలువురు తమ పేర్లను మార్చుకుంటూ ఉంటారు.అయితే, పేరు మార్చుకోవడం అనేది ప్రాథమిక హక్కే అయినప్పటికీ, అది పరిమితులతో కూడిందని, దీనికోసం కచ్చితంగా చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండాలని అలహాబాద్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని చీఫ్ జస్టిస్ అరుణ్ బన్సాలి, జస్టిస్ క్షితిజ్ శైలేంద్ర స్పష్టం చేసినట్లు లా ట్రెండ్ పేర్కొంది. దీనిలో సివిల్ కోర్టు డిక్లరేషన్ తప్పనిసరిగా కావాలని తెలిపింది.

తన పేరును షానవాజ్ నుంచి మొహమ్మద్ సమీర్‌రావుగా మార్చాలని కోరుతూ ఆ వ్యక్తి పిటిషన్ వేశారు.అయితే, అసలు చట్టబద్ధంగా పేరు మార్చుకోవాలంటే ఎలా..? ఏయే న్యాయ ప్రక్రియలను అనుసరించాలి..? రాజ్యాంగంలో ఏ ఆర్టికల్ కింద పేరు మార్చుకునే వీలుంటుంది..? పేరు మార్చుకున్న తర్వాత ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది..?

పేరు మార్చుకోవడం ఎలా?

భారత్‌లో పేరు మార్చుకోవడానికి కచ్చితంగా న్యాయ, అధికారిక ప్రక్రియలను అనుసరించాలి.ముందుగా పేరు మార్చుకోవాలనుకోవడానికి కారణమేంటో చెప్పాల్సి ఉంటుంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారు, ఇతర వివరాలు తెలుపుతూ న్యాయవాది సాయంతో స్టాంప్ పేపర్‌పై అఫిడవిట్‌ను సిద్ధం చేసుకున్న తర్వాత, ఆ అఫిడవిట్‌ను నోటరీ చేయించుకోవాలి. ఇద్దరు సాక్షులతో సంతకం చేయించాలి. ఆ డాక్యుమెంట్‌పై అధికారిక స్టాంప్ ఉండాలని ఇండియా లా ఆఫీసెస్ డాట్ కామ్ పేర్కొంది.ప్రస్తుత పేరు, కొత్త పేరు, పేరు మార్పుకు గల కారణాలు తెలుపుతూ వార్తా పత్రికలో దరఖాస్తుదారు ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది.ఆ తర్వాత గెజిట్ నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన డాక్యుమెంట్లు, న్యూస్‌పేపర్ క్లిపింగ్స్, అఫిడవిట్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్‌కు పంపాలి. పేరు మార్చుకునేందుకు అవసరమయ్యే లీగల్ వెరిఫికేషన్‌కు గెజిట్ నోటిఫికేషన్ అదనపు లేయర్ లాంటిది.ఒకవేళ విదేశాల్లో నివసించే భారతీయులు పేరు మార్చుకోవాలంటే, సంబంధిత భారత రాయబార కార్యాలయం, ఇండియన్ హై కమిషన్ ధ్రువీకరించిన డీడ్‌ను పబ్లికేషన్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలి.అలాగే, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లికేషన్ నిర్దేశించిన ప్రింటింగ్ వివరాలను కూడా ఒక తెల్లని కాగితంపై టైప్ చేసి, పాత పేరుతో సంతకం చేసి, రెండు సాక్షి సంతకాలను పెట్టించి, సాఫ్ట్ కాపీతో పాటు పంపించాలి.పేరు మార్పుకు ప్రింటింగ్ చార్జీలు కూడా చెల్లించాలి. మేజర్ లేదా ప్రభుత్వ ఉద్యోగి అయితే పేరు మార్పు కోసం రూ.1100 చెల్లించాలి. విదేశాల్లో నివసించే భారతీయులు అయితే రూ.3,500 చెల్లించాలి.దరఖాస్తుదారు పెట్టుకున్న అప్లికేషన్‌తో అధికారి సంతృప్తి చెందితే, అధికారిక రికార్డులలో కొత్త పేరుతో ఆ వ్యక్తి పేరును రికార్డు చేస్తారు. గెజిట్ నోటిఫికేషన్ సాయంతో ఆ వ్యక్తి తన కొత్త పేరును ప్రభుత్వం జారీ చేసిన అధికారిక డాక్యుమెంట్లలో అప్‌డేట్ చేసుకోవచ్చు.అయితే, పేరు మార్చుకోవాలనుకునే వ్యక్తి మైనర్ అయితే, తల్లిదండ్రులు అఫిడవిట్ చేయించి, ఈ న్యాయ ప్రక్రియను పూర్తి చేయాలి.

**పేరు మార్పుకు కావాల్సిన పత్రాలు**

**అప్లికేషన్ ఫామ్**

**రెండు ఇటీవల పాస్‌పోర్టు సైజు ఫొటోగ్రాఫ్‌లు**

**గెజిటెడ్ ఆఫీసర్ జారీ చేసిన పౌరసత్వ పత్రం**

**పేరు ఎందుకు మార్చుకోవాలనుకుంటున్నారో తెలుపుతూ అఫిడవిట్**

**గెజిటెడ్ ఆఫీసర్ సంతకంతో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకున్న సర్టిఫికేట్లు**

**గత ఐదేళ్లలో తనపై ఎలాంటి కేసులు లేవని తెలుపుతూ ఇచ్చే పోలీసు సర్టిఫికేట్**

**ఆధార్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ వంటివి సమర్పించాలి.**

**పేరు మార్పును ఎక్కడెక్కడ అప్‌డేట్ చేసుకోవాలి?**

**ఒకసారి పేరు మార్చుకున్న తర్వాత వెంటనే పాన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్ వంటి కీలక డాక్యుమెంట్లలో కొత్త పేరును అప్‌డేట్ చేసుకోవాలి.ఈ అన్ని డాక్యుమెంట్లలో పేరును అప్‌డేట్ చేసుకోవడం మీ వ్యక్తిగత, వృత్తి జీవితానికి అత్యంత కీలకం.**

**1. ఎలాంటి ఇబ్బందులు వస్తాయి? పేరు మార్పు ప్రక్రియలో ఎలాంటి నిబంధనలు, ఇబ్బందులు ఎదురవుతాయి?**

పేరు మార్చుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా, కొత్త పేరును అధికారికంగా గుర్తించేందుకు అవసరమైన ధృవపత్రాలు సేకరించాలి. గెజిట్ నోటిఫికేషన్, ఆధార్, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా, విద్యా ధృవ పత్రాలు, ఆస్తి పత్రాలు మొదలైన వాటిని నవీకరించాలి.కొన్ని సందర్భాల్లో, పేరు మార్పు ప్రక్రియ సమయంలో అనుమానాస్పద లావాదేవీలతో సంబంధముందని భావించి పోలీస్ వెరిఫికేషన్ కూడా కావొచ్చు.పాత పేరుతో ఉన్న ఒప్పందాలు, బ్యాంక్ రుణాలు, లీగల్ కేసులు ఉంటే, వాటిని అప్‌డేట్ చేయడం అవసరం.ఇతర డాక్యుమెంట్స్ మారడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. నోటరీ అఫిడవిట్, వార్తాపత్రికలో ప్రకటన వంటి నిబంధనలు పాటించాలి.కొన్ని ప్రభుత్వ విభాగాలు పేరుమార్పును వెంటనే అంగీకరించకపోవచ్చు, ఎటువంటి సందేహాలు లేకుండా సరైన ఆధారాలు సమర్పించాల్సి వస్తుంది.

**2. దరఖాస్తును ఎప్పుడు తిరస్కరిస్తారు?**

పేరు మార్పు దరఖాస్తు కొన్ని కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది. సమర్పించిన పత్రాలలో తప్పులు, అస్పష్టతలు లేదా సరైన ఆధారాలు లేకపోతే అభ్యర్థన తిరస్కరిస్తారు.నోటరీ అఫిడవిట్, గెజిట్ నోటిఫికేషన్ లేదా వార్తాపత్రిక ప్రకటన లేకపోతే అనుమతించరు.న్యాయపరమైన సమస్యలు, బ్యాంకు రుణాలు, క్రిమినల్ కేసులు లేదా ఇతర లీగల్ ఇష్యూలు ఉన్నప్పుడు అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశముంది.ప్రభుత్వ నియమాలు, విధానాలకు విరుద్ధంగా ఉంటే లేదా మార్పు అనుమతించని పేరును అభ్యర్థిస్తే కూడా దరఖాస్తును అంగీకరించరు.అదనపు పరిశీలన అవసరమైన సందర్భాల్లో సరైన సమాధానాలు లేకపోతే తిరస్కరణకు గురవుతుంది.

**3. పేరు మళ్లీ మార్చుకోవచ్చా?**

ఒకసారి చట్టబద్ధంగా పేరు మార్చుకున్న తర్వాత, అవసరమైతే మళ్లీ పేరు మార్చుకోవచ్చు. అయితే, ఇది మొదటిసారి మార్చుకున్న దానికంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ అవుతుంది.పునఃమార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, వార్తాపత్రిక ప్రకటన మళ్లీ ఇవ్వాలి. పేరు వరుసగా మార్చుకోవడంపై అధికారులు అనుమానం వ్యక్తం చేసే అవకాశముంది. అందుకే సరైన కారణాలు చూపించాలి.బ్యాంకింగ్, ఆస్తి, విద్య, పాస్‌పోర్ట్ సంబంధిత వ్యవహారాల్లో ముందుగా మార్పును అంగీకరించడంలో కొన్ని పరిమితులు ఉండొచ్చు. గత మార్పుల గురించి పూర్తి వివరాలతో సరైన ఆధారాలు సమర్పిస్తే మళ్లీ పేరు మార్చుకోవచ్చు.

**4. పేరు అప్‌డేట్‌కు టైమ్ లిమిట్ ఉంటుందా?**

గెజిట్‌లో పేరు మార్చుకున్న తర్వాత విద్యా సర్టిఫికేట్లలో పేరు అప్‌డేట్ చేసుకోవడానికి అధికారికంగా ప్రత్యేకమైన టైమ్ లిమిట్ అనేది లేదని సాధారణంగా భావిస్తారు.అయితే, ప్రతి విద్యా బోర్డు లేదా యూనివర్శిటీ తమ విధానాల ప్రకారం మార్పు దరఖాస్తులకు గడువును నిర్ణయించే అవకాశం ఉంది.కొన్ని సంస్థలు పరీక్ష పూర్తయిన కొన్ని సంవత్సరాల లోపల మాత్రమే పేరు మార్పును అనుమతిస్తాయి, మరికొన్ని మాత్రం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇస్తాయి.మార్పు కోసం గెజిట్ నోటిఫికేషన్, నోటరీ అఫిడవిట్, పాత, కొత్త పేరు ఆధారాలతో పాటు విద్యా సంస్థ నిర్దేశించిన ఫీజు చెల్లించాలి.నిర్దిష్ట సమయం ఉన్నదో లేదో తెలుసుకోవడానికి సంబంధిత బోర్డు లేదా యూనివర్శిటీ అధికారిక నిబంధనలను పరిశీలించడం మంచిది.

**5. సివిల్ కోర్టు డిక్లరేషన్ ఎప్పుడు అవసరం ?**

సివిల్ కోర్టు డిక్లరేషన్ ప్రధానంగా ఏదైనా హక్కు లేదా హోదా నిర్ధరణ అవసరమైనప్పుడు అవసరం పడుతుంది.ప్రత్యేకంగా, పేరు మార్పు లేదా సంతానం గుర్తింపు వంటి లీగల్ అంశాలలో అధికారిక ధృవీకరణ అవసరమైనప్పుడు దీనిని కోరవచ్చు.ఆస్తి హక్కుల వివాదాలు, వారసత్వ హక్కులు, ఒప్పంద చట్టబద్ధతను నిర్ధారించుకోవడం, లేదా రికార్డులలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయించుకోవడానికి కూడా కోర్టు డిక్లరేషన్ తీసుకోవాల్సి వస్తుంది.కొన్ని సందర్భాల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలు పేరు మార్పు లేదా ఇతర హక్కుల నిర్ధరణకు గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు కోర్టు డిక్లరేషన్ కూడా తప్పనిసరిగా కోరవచ్చు.అప్లికేషన్ తిరస్కరణ లేదా లీగల్ సమస్యలు ఉన్నప్పుడు కోర్టు ద్వారా అధికారిక నిర్ధారణ పొందడం అవసరం అవుతుంది.

**6. రాజ్యాంగం ఏం చెబుతోంది?**

పేరు మార్చుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని న్యాయవాదులు చెబుతున్నారు.భారత రాజ్యాంగంలో కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ), 21, 14 ప్రాథమిక హక్కుల కింద భారతీయ పౌరులు తమ పేరును మార్చుకోవచ్చని అలహాబాద్ సింగిల్ బెంచ్ ఇచ్చిన కోర్టు తీర్పులో పేర్కొంది.అయితే, అలహాబాద్ డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులో మాత్రం ప్రాథమిక హక్కులకు కూడా పరిమితులు ఉన్నాయని తెలిపింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) వాక్ స్వాతంత్ర్యం, 21వ ఆర్టికల్ వ్యక్తిగత స్వేచ్ఛను, 14వ ఆర్టికల్ సమానత్వ హక్కును భారతీయ పౌరులకు అందిస్తాయి.

# “ట్రాఫిక్ చలాన్లు“ పేరుతో కొత్తరకం సైబర్ మోసం

**ఈ మెసేజ్‌లు ఓపెన్ చేస్తే మీ పనైపోయినట్లే!**

**‘ట్రాఫిక్ చలాన్ పెండింగ్‘ అంటూ మెసేజ్ వచ్చిందా?**

**ఈ జాగ్రత్తలు తీసుకోకుంటే మీ ఖాతా ఖాళీ!**

నేటి డిజిటల్ యుగంలో రోజురోజుకు సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. మారిన టెక్నాలజీకి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు అప్‌డేట్ అవుతూ కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నారు. ముఖ్యంగా ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు కేటుగాళ్లు రోజుకో రకం నయా ఫ్రాడ్స్‌తో జనాలను ఆందోళనకు గురి చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు ఈకేవైసీ, ఖరీదైన గిఫ్ట్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో మోసాలకు పాల్పడిన సైబర్ మాయగాళ్లు ఇప్పుడు రూటు మార్చారు. ఇటీవల ట్రాఫిక్ చలాన్ల పేరుతో కొత్తరకం దోపిడీకి పాల్పడుతున్నారు. మీకు ట్రాఫిక్ చలాన్ పెండింగ్‌లో ఉందంటూ ఏదైనా మెసేజ్ వచ్చిందా? అయితే, తస్మాత్ జాగ్రత్త. ఎందుకంటే ట్రాఫిక్ చలాన్ పెండింగ్‌లో ఉందంటూ ఎస్సెమ్మెస్‌లు పంపుతూ అమాయక ప్రజల నుంచి డబ్బులు దోచేస్తున్నారు సైబర్ మోసగాళ్లు. ఈ క్రమంలోనే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం అధికారులు అలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ట్విట్టర్(ఎక్స్)లో ఒక పోస్టు పెట్టారు. అందులో ట్రాఫిక్ చలాన్ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల బారినపడకుండా ఉండడం కోసం కొన్ని జాగ్రత్తలు సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు చూద్దాం. నార్మల్‌గా రోడ్డుపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ ఏమైనా అతిక్రమిస్తే ప్రధాన కూడళ్లలో ఉండే కెమెరాల ద్వారా మన వెహికల్‌కు చలాన్ వేస్తుంటారు ట్రాఫిక్ అధికారులు. అందుకు సంబంధించిన ఫైన్‌ను ట్రాఫిక్ పోలీసులు మన రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఎస్సెమ్మెస్ రూపంలో సెండ్ చేస్తుంటారు. అలాగే, కొన్నిసార్లు స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతూ వాహనంపై ఏమైనా చలాన్లు ఉంటే స్పాట్‌లోనే లింకులు పంపించి ఫైన్ కట్టించుకుంటుంటారు. దీన్ని అవకాశంగా తీసుకున్న కొందరు సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పంపినట్లుగా మీ వెహికల్‌పై చలాన్ పెండింగ్‌లో ఉందంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. మీకు అలా ఏదైనా మెసేజ్‌లు వస్తున్నాయా? అయితే, ఒక్క క్షణం ఆగండి. తొందరపడి అలాంటి



మెసేజ్‌తో వచ్చిన లింక్‌లపై క్లిక్ చేసేయొద్దు.. ముందుగా వెరిఫై చేసుకోవాలని సూచిస్తున్నారు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం అధికారులు. సైబర్ మోసగాళ్లు నకిలీ ను ఈ-చలాన్ లింక్‌లు, ఏపీకే, పీడీఎఫ్‌లను ఎస్సెమ్మెస్/వాట్సప్ ద్వారా పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి లింక్‌లపై క్లిక్ చేయడం వల్ల మీ ఓటీపీలు ప్రమాదంలో పడొచ్చని హెచ్చరిస్తున్నారు. ఆ ఓటీపీలు అనధికారిక బ్యాంకు/యూపీఐ లావాదేవీలకు కూడా దారితీయొచ్చంటున్నారు అధికారులు. ముఖ్యంగా పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల పేరుతో మెసేజ్‌లలో వచ్చిన చలాన్ లింక్‌లపై అస్సలు క్లిక్ చేయొద్దని సూచిస్తున్నారు. అలాగే, వాట్సప్/ఎస్సెమ్మెస్ ద్వారా వచ్చిన ఏపీకే ఫైల్స్‌ని ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయొద్దని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ మీ వాహనంపై వాస్తవంగానే ట్రాఫిక్ చలాన్స్ ఉండి ఇలాంటి సందేశాలు వస్తే ముందుగా అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, అధికారిక స్టోర్‌ల నుంచి మాత్రమే ఏవైనా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెబుతున్నారు. మీకు కూడా ట్రాఫిక్ చలాన్లు పెండింగ్ అంటూ ఇలాంటి లింక్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అనుమానం ఉంటే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం అధికారులు.

# 30 రంగాలు, 6వేల వస్తువులపై క్రూడాయిల్ ఎఫెక్ట్

**ఇక వాటిపై ధరల మోతే!**

**ధరలు ఆకాశానికి, గిరాకీలు పాతాళానికి**

**ఏఏ రంగాలపై ప్రభావం ఉందంటే!**

‘ఇరాన్-అమెరికా‘ వార్ ఇంకెన్నాళ్లు కొనసాగుతుంది? ఇంధన సంక్షోభం ఇంకెంత దూరం వెళ్తుంది. ముడి చమురు రవాణా మార్గం ‘హర్మూజ్‘లో పరిస్థితులు ఎపుడు సాధారణ స్థితి చేరుకుంటాయి? అనే ప్రశ్నలకు ఇప్పటికిప్పుడు సమాధానం చెప్పే వారు లేరు. కానీ, రెండు నెలలుగా కొనసాగుతున్న పశ్చిమాసియా యుద్ధం ప్రపంచంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి దారితీసిందని మాత్రం చెప్పొచ్చు. ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు సంప్రదింపులు, చర్చలు జరుగుతున్నా అనిశ్చితి వీడడం లేదు. ఫలితంగా మందగించిన ముడి చమురు సరఫరా వివిధ రంగాలపై పెను ప్రభావం చూపుతోంది. రష్యా నుంచి కొనుగోళ్లకు ఎలాంటి అవాంతరాలు లేకున్నా రవాణాకు సుదీర్ఘ సమయం, పెరుగుతున్న వ్యయాలు సమస్యను గట్టెక్కించలేకపోతున్నాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముడిచమురు కొరత కారణంగా దాదాపు 30రంగాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నట్లు ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. ముడి చమురు దిగుమతుల్లో 35-50శాతం వరకు గల్ఫ్ దేశాలపై ఆధారపడగా, హర్మూజ్ జలసంధి ఏకైక రవాణా మార్గం. యుద్ధం కారణంగా రష్యా నుంచి ముడి చమురు సరఫరా పెంచుకున్నా రవాణాకు అధిక సమయం, బీమా వ్యయాలు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్ మధ్యలో హర్మూజ్ మార్గంలో పరిస్థితులు కాస్త మెరుగుపడి నౌకల రాకపోకలు మెరుగుపడ్డాయి. కానీ, అంతలోనే పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ముడి చమురు అనగానే కేవలం ఇంధన వనరుగానే చూస్తుంటారు. కానీ, 6వేల వస్తుత్పత్తి రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలుసా? వాటిలో ప్రధానంగా వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక (టెక్నాలజీ) రంగాలు ఉన్నాయి. వైద్య ఉత్పత్తుల పాలీమర్లు, నైట్రోజన్ ఆధారిత ఎరువులు, సర్క్యూట్ బోర్డు రెసిన్ వంటి పలు రంగాలు పెట్రోలియం ఉత్పత్తులపై ఆధారపడి ఉన్నాయి. సిరామిక్స్ మొదలుకుని ఎఫ్ఎమ్‌సీజీ వరకు దాదాపు 30 రంగాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా







ప్రభావం కనిపిస్తోంది. ఇంధన సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఎన్నో రంగాలు కుదేలవుతాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోయి గిరాకీపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముడిచమురు కొరత ఎఫెక్ట్ ఎరువుల ఉత్పత్తిపై ప్రత్యక్షంగా కనిపిస్తోంది. సహజవాయువు కొరత ఫలితంగా ఎరువుల ఉత్పత్తి క్షీణించింది. 2025 మార్చితో పోలిస్తే 24.6శాతం తగ్గిపోయిందని ‘క్రిసిల్‘ విశ్లేషిస్తూ ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమని పేర్కొంది. కొన్ని దేశాలు గగనతల ఆంక్షలు విధించడం, ఇంధన ధరల్లో పెరుగుదల, రూపాయి విలువ పడిపోవడం విమానయాన సంస్థల నిర్వహణ భారంగా మారింది. ఎల్ఎన్‌జీ, ప్రొపేన్‌పై అధికంగా ఆధారపడిన సిరామిక్స్ రంగం ఆదాయాల్లో 35శాతం, నిర్వహణ మార్జిన్‌లో 50శాతం క్షీణత ఉండొచ్చని అంచనా. సిమెంట్, పాలీవినైల్ క్లోరైడ్ పైపులు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు లాభాల మార్జిన్లలో ఒత్తిడికి గురవుతున్నాయి. సిమెంటు పరిశ్రమల వ్యయాల్లో 15శాత వాటా ఇంధనానిదే కాగా ప్రత్యామ్నాయంగా బొగ్గు వైపు మారే అవకాశాలున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగి వినియోగదారు సెంటిమెంటు బలహీనపడితే ఎఫ్ఎమ్‌సీజీ, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. స్థిరాస్తి, ఆతిథ్య రంగాలు తగ్గిన డిమాండు, పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్లుగా సిద్ధమవుతున్నాయి. రంగులు, రహదారులు, వంతెనలు, టైర్ల పరిశ్రమల ఆదాయాలూ తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయా పరిశ్రమల్లో తారు, సింథటిక్ రబ్బరు ముడి పదార్థాలు వాడుతుండటం, రిఫ్రిజరెంట్ వాయువుల ధర పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, ఇతర మార్కెట్ల ద్వారా ఇంధన సరఫరా పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా పరిస్థితులు అనుకూలించడం లేదు. చమురు ధర అధికంగా ఉండటం, సరకు రవాణా సమయం, వ్యయాలు, బీమా ఛార్జీలు పెరగడం అడ్డంకిగా మారింది. వీటికి తోడు ఆయిల్ ట్యాంకర్ల కొరత, షిప్పింగ్, ట్రాన్సిట్ వ్యయాలు ఇబ్బంది పెడుతున్నాయి. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు నష్టాలు మూటగట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు పెంచి కొంత భారాన్ని ప్రజలకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జాబ్ స్కామ్స్‌పై అత్యంత అప్రమత్తంగా భారతీయ ప్రొఫెషనల్స్- కానీ ఒత్తిడిలో రిస్క్

**జాబ్ స్కామ్‌లపై 82 శాతానికిపైగా ప్రొఫెషనల్స్‌లో అప్రమత్తత**

**జాబ్ పోస్ట్‌ల ప్రామాణికతను తనిఖీ చేస్తున్న 53 శాతం మంది**

**జెన్ జీలో సగం మందికిపైగా అప్రమత్తంగా లేరు**

జాబ్ స్కామ్‌ల విషయంలో భారతీయ ప్రొఫెషనల్స్ చాలా అప్రమత్తంగానే ఉంటున్నారు. అయితే ఉద్యోగ అవకాశాలను ఎలాగైనా దక్కించుకోవాలనే ఒత్తిడిలో కొన్నిసార్లు అప్రమత్తతను పాటించడం లేదు. ప్రత్యేకించి కెరీర్ ప్రారంభ దశలోని పలువురు ప్రొఫెషనల్స్ ఇలా చేస్తున్నారు. ఈమేరకు వివరాలతో ‘జాబ్ సెర్చ్ సేఫ్టీ పల్స్ - 2026’ అధ్యయన నివేదికను లింక్డ్ ఇన్ (ాఱఅవఅవఽ×అ) బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 16 నుంచి 30 వరకు భారత్, యూకే, అమెరికా, జర్మనీ, బ్రెజిల్ దేశాల్లో ఫుల్ టైం, పార్ట్ టైం జాబ్స్ చేస్తున్న 8,512 మంది ప్రొఫెషనల్స్‌ను లింక్డ్ ఇన్ సర్వే చేసింది. వారు చెప్పిన సమాధానాల ఆధారంగా తాజా అధ్యయన నివేదికను రూపొందించింది. భారతీయ ప్రొఫెషనల్స్‌కు జాబ్ స్కామ్‌లపై అవగాహన చాలా పెరిగింది. దాదాపు 82 శాతానికిపైగా ప్రొఫెషనల్స్ జాబ్ స్కామ్‌ల విషయంలో అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు. ఏదైనా ఉద్యోగానికి అప్లై చేసే ముందు, అది వాస్తవికమైందా కాదా అనేది నిర్ధారించుకుంటున్నారు. ఒక సంవత్సరం కిందటితో పోలిస్తే ఇప్పుడు సగాని కంటే ఎక్కువ మంది (53 శాతం) ప్రొఫెషనల్స్ ఏదైనా జాబ్‌కు అప్లై చేసే ముందు, అది వాస్తవికమైందేనా ? నకిలీదా ? అనేది ఆరా తీస్తున్నారు. కొన్నిసార్లు ఎలాగైనా ఉద్యోగాన్ని సాధించాలనే ఒత్తిడిలో ఉద్యోగాలకు అప్లై చేసే క్రమంలో ప్రొఫెషనల్స్ అప్రమత్తంగా వ్యవహరించడం లేదు. ప్రత్యేకించి కెరీర్ ప్రారంభ దశలో ఉన్నవారు ఈవిధమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. లింక్డ్ ఇన్ సర్వేలో పాల్గొన్న జెన్ జీ (2026లో 16 -30 ఏళ్లలోపువారు) కేటగిరీ ప్రొఫెషనల్స్‌లో సగం మందికిపైగా (54 శాతం) ఉద్యోగాలకు అప్లై చేసేటప్పుడు అప్రమత్తతను పాటించలేదని ఒప్పుకున్నారు. ఉద్యోగ అవకాశం చాలా ముఖ్యమైందిగా అనిపించిన పలు సందర్భాల్లో తాము అప్రమత్తతను గాలికొదిలేశామని వారు తెలిపారు. తాము జాబ్ స్కామ్స్ వలకు దగ్గరి దాకా వెళ్లొచ్చామని భారతీయ జెన్ జీ కేటగిరీలోని ప్రొఫెషనల్స్‌లో దాదాపు సగం మంది (49 శాతం) చెప్పారు. 2026లో 46 నుంచి 61 ఏళ్లలోపు వయసు కలిగిన వారిని జెన్ ఎక్స్ అంటారు. తాము సైతం జాబ్ స్కామ్స్ ముప్పు నుంచి త్రుటిలో తప్పించుకున్నామని 36 శాతం మంది జెన్ ఎక్స్ ప్రొఫెషనల్స్ తెలిపారు. దీన్నిబట్టి జాబ్ స్కామ్‌ల ముప్పును ఎక్కువగా ఎదుర్కొంటున్నది యువ ఉద్యోగార్థులే అని తేటతెల్లమైంది. ఆ 2 సందర్భాల్లో ఉద్యోగార్థుల ఆందోళన జాబ్ స్కాంల గురించి ప్రొఫెషనల్స్ ఎక్కువగా ఆందోళన చెందే సందర్భాలేవి అనే దానికీ లింక్డ్ ఇన్ సర్వేలో సమాధానాలు దొరికాయి. ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నప్పుడు జాబ్ స్కామ్స్ ఆందోళన తమకు ఉంటుందని 20 శాతం మంది చెప్పారు. ఒక రిక్రూటర్ లేదా కంపెనీ తమను తొలిసారిగా సంప్రదించినప్పుడు కూడా జాబ్ స్కామ్స్ ఆందోళన వెంటాడుతుందని మరో 18 శాతం మంది తెలిపారు. ఈ రెండు సందర్భాల్లోనూ ఉద్యోగాన్ని భర్తీ చేస్తున్న సంస్థ గురించి ప్రొఫెషనల్స్ వద్ద వివరాలు పరిమితంగానే ఉంటాయి. దీనివల్ల ఆ సమయానికి ఆ సంస్థను వాళ్లు పూర్తిగా నమ్మే పరిస్థితి ఉండదు. జాబ్ స్కామ్స్ చేసే మోసగాళ్లు తరచుగా ఈ తొలి క్షణాలనే తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ఉద్యోగార్థులతో తాము జరిపే సంభాషణలను విశ్వసనీయ జాబ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి వేరే చోట్లకు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నారు. వెలుగులోకి వచ్చిన జాబ్ స్కామ్స్ ప్రకారం, మోసగాళ్లు ఉద్యోగానికి అప్లై చేసిన వ్యక్తులకు నేరుగా వ్యక్తిగత మెసేజింగ్ యాప్‌ల ద్వారా సంప్రదిస్తున్నారు. జాబ్ స్కామ్స్ చేసే వాళు దాదాపు 90 శాతం మంది అభ్యర్థులను ఇలాగే అనధికారిక మెసేజింగ్ యాప్‌ల వైపునకు దారి మళ్లిస్తున్నారు. విశ్వసనీయ జాబ్ ప్లాట్‌ఫామ్‌లతో ఏమాత్రం సంబంధం లేని ఈ అనధికారిక యాప్‌లలోని ఖాతాలు, వాటిలో జరిపే సంభాషణలు ప్రశ్నార్థకమైనవి అని లింక్డ్ ఇన్ నివేదిక తెలిపింది. “ప్రొఫెషనల్స్ ఆన్‌లైన్‌లో ఉద్యోగాలను వెతికే క్రమంలో జాబ్ స్కామ్స్ బారినపడటం సర్వసాధారణంగా మారుతోంది. అయితే ఈ స్కాంలపై ప్రొఫెషనల్స్‌లో అవగాహన పెరుగుతోందని మా సర్వేలో గుర్తించాం. ఉద్యోగాల కోసం జరిగే తీవ్ర పోటీలో మునిగిపోయి, కెరీర్ ప్రారంభ దశలో ఉన్నవాళ్లు జాబ్ స్కాంలను గుర్తించలేకపోతున్నారు. వారిపై ఉండే ఒత్తిడి వల్ల అలా జరుగుతోంది. అందుకే సురక్షితమైన ఉద్యోగ వ్యవస్థను నిర్మించడానికి జాబ్ ప్లాట్‌ఫామ్‌లు, కంపెనీల యజమానులు, ఉద్యోగార్థులందరిలో పటిష్టమైన రక్షణ చర్యలు, విశ్వసనీయ సంకేతాలు, ఉమ్మడి జవాబుదారీతనం ఉండాలి“ అని లింక్డ్ ఇన్ ఇండియా హెడ్ (లీగల్ అండ్ పబ్లిక్ పాలసీ) అదితి ఝా తెలిపారు.

# ముడిచమురు కొరత ఎఫెక్ట్ ఎరువుల ఉత్పత్తిపై ప్రత్యక్షంగా



సహజవాయువు కొరత ఫలితంగా ఎరువుల ఉత్పత్తి క్షీణించింది. 2025 మార్చితో పోలిస్తే 24.6శాతం తగ్గిపోయిందని ‘క్రిసిల్‘ విశ్లేషిస్తూ ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ జోక్యం అవసరమని పేర్కొంది. కొన్ని దేశాలు గగనతల ఆంక్షలు విధించడం, ఇంధన ధరల్లో పెరుగుదల, రూపాయి విలువ పడిపోవడం విమానయాన సంస్థల నిర్వహణ భారంగా మారింది. ఎల్ఎన్‌జీ, ప్రొపేన్‌పై అధికంగా ఆధారపడిన సిరామిక్స్ రంగం ఆదాయాల్లో 35శాతం, నిర్వహణ మార్జిన్‌లో 50శాతం క్షీణత ఉండొచ్చని అంచనా. దసిమెంట్, పాలీవినైల్ క్లోరైడ్ పైపులు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు లాభాల మార్జిన్లలో ఒత్తిడికి గురవుతున్నాయి. సిమెంటు పరిశ్రమల వ్యయాల్లో 15శాత వాటా ఇంధనానిదే కాగా ప్రత్యామ్నాయంగా బొగ్గు వైపు మారే అవకాశాలున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగి వినియోగదారు సెంటిమెంటు బలహీనపడితే ఎఫ్ఎమ్‌సీజీ, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. స్థిరాస్తి, ఆతిథ్య రంగాలు తగ్గిన డిమాండు, పెరుగుతున్న ఖర్చులకు తగ్గట్లుగా సిద్ధమవుతున్నాయి. రంగులు, రహదారులు, వంతెనలు, టైర్ల పరిశ్రమల ఆదాయాలూ తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయా పరిశ్రమల్లో తారు, సింథటిక్ రబ్బరు ముడి పదార్థాలు వాడుతుండటం, రిఫ్రిజరెంట్ వాయువుల ధర పెరగడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, ఇతర మార్కెట్ల ద్వారా ఇంధన సరఫరా పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా పరిస్థితులు అనుకూలించడం లేదు. చమురు ధర అధికంగా ఉండటం, సరకు రవాణా సమయం, వ్యయాలు, బీమా ఛార్జీలు పెరగడం అడ్డంకిగా మారింది. వీటికి తోడు ఆయిల్ ట్యాంకర్ల కొరత, షిప్పింగ్, ట్రాన్సిట్ వ్యయాలు ఇబ్బంది పెడుతున్నాయి. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను పెంచకపోవడంతో ప్రభుత్వ రంగ చమురు విక్రయ సంస్థలు నష్టాలు మూటగట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ధరలు పెంచి కొంత భారాన్ని ప్రజలకు మళ్లించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అల్వాల్-మౌలా అలీలో కొత్త ఎంఎంటీఎస్ స్టేషన్లు

**మీ ఆస్తి విలువను మార్చేయబోతున్న ఈ మార్పు ఇదే!**




ఉత్తర హైదరాబాద్ వాసులకు రైల్వే శాఖ తీపి కబురు అందించింది. ఎంఎంటీఎస్ విస్తరణలో భాగంగా అల్వాల్ సమీపంలో మూడు కీలక స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. దీనివల్ల శివారు ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. తక్కువ ఖర్చుతో, వేగంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని ప్రయాణికులు ఆశిస్తున్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే అల్వాల్-మౌలా అలీ మధ్య ఈ కొత్త రైల్వే స్టేషన్లు రాబోతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ రోడ్లు ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంఎంటీఎస్ అందుబాటులోకి వస్తే రోడ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆఫీసులకు వెళ్లేవారికి ఇది ఒక వేగవంతమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది. ఈ ప్రాంతాల్లో భూముల కొనుగోలుకు ఇన్వెస్టర్లు ఇప్పుడే క్యూ కడుతున్నారు. కొత్త స్టేషన్ల ప్రకటనతో రెసిడెన్షియల్ ప్లాట్ల కోసం ఎంక్వైరీలు ఒక్కసారిగా పెరిగాయి. ఇప్పటికే ఇక్కడ ధరలు పెరగడం మొదలైందని స్థానిక బ్రోకర్లు చెబుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన పట్టణ అభివృద్ధిని ఏ స్థాయిలో ప్రభావితం చేస్తుందో ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. ట్రాఫిక్ కష్టాలు తప్పించుకోవడానికి చాలా కుటుంబాలు రైల్వే స్టేషన్లకు దగ్గరగా ఉండాలని కోరుకుంటున్నాయి, దీంతో అద్దె ఇళ్లకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ఈ ట్రెండ్ కారణంగా మధ్యతరగతి గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అల్వాల్ బెల్ట్ హాట్ స్పాట్‌గా మారింది. మంచి అద్దెదారులు దొరుకుతారనే ఆశతో యజమానులు కూడా తమ ఇళ్లను ఆధునీకరిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ హబ్‌లకే పరిమితం కాకుండా ఉత్తర దిశగా వేగంగా విస్తరిస్తోంది. మెరుగైన కనెక్టివిటీ వల్ల యువ ఉద్యోగులు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎంఎంటీఎస్ ఫేజ్-2 ప్రాజెక్ట్ ఈ వికేంద్రీకరణలో కీలక పాత్ర పోషిస్తోంది. పాతబడిన శివారు ప్రాంతాలు ప్రొఫెషనల్ గ్రోత్ సెంటర్లుగా మారడానికి ఇది ఒక వెన్నెముకలా నిలుస్తుంది. ప్రతిపాదిత మూడు స్టేషన్లు జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ఎంతో మేలు చేస్తాయి. సికింద్రాబాద్ లైన్‌ను మేడ్చల్ రూట్‌తో ఇవి అనుసంధానిస్తాయి. దీనివల్ల సిటీ సెంటర్‌లోకి వెళ్లకుండానే ప్రయాణికులు సులభంగా లైన్లు మారవచ్చు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, రైల్వే సామర్థ్యాన్ని పెంచేలా ఈ ప్లాన్ రూపొందించారు. బడ్జెట్ కేటాయింపులతో ఈ ప్రాజెక్టులకు కొత్త ఊపిరి వచ్చింది. భూసేకరణ సమస్యలను పరిష్కరించి పనులను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నాళ్లో వేచి చూస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు వేగం పుంజుకుంది. వచ్చే రెండేళ్లలో పనులు పూర్తి కావాలని స్థానికులు కోరుకుంటున్నారు. ఈ రైల్వే అప్‌గ్రేడ్ వల్ల స్థానిక మార్కెట్‌లో ఎలాంటి మార్పులు వస్తాయో కింద చూడవచ్చు. ఇన్వెస్టర్లు ఈ గణాంకాలను గమనిస్తే ఇక్కడి ఆర్థిక సామర్థ్యం అర్థమవుతుంది. నివాస ప్రాంతాలు మరియు ప్రాపర్టీ కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులకు ఇవి నిదర్శనం.

# బ్యాంక్ అకౌంట్ క్లోజ్ చేయాలనుకుంటున్నారా

**స్టెప్-బై-స్టెప్ ప్రాసెస్ మీకోసం!**



చాలామందికి రకరకాల కారణాల వల్ల ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ అకౌంట్లు ఉంటాయి. పాత ఉద్యోగం మారినప్పుడో లేదా వేరే ఊరికి షిఫ్ట్ అయినప్పుడో పాత బ్యాంక్ అకౌంట్ అలాగే ఉండిపోతుంది. అయితే, వాడకుండా వదిలేసిన అకౌంట్ల వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే పెనాల్టీలు పడటం, ఏటా డెబిట్ కార్డ్ ఛార్జీలు కట్ అవ్వడం వంటివి జరుగుతుంటాయి. అందుకే, అవసరం లేని అకౌంట్‌ను క్లోజ్ చేయడం ఉత్తమం. మరి ఆ ప్రాసెస్ ఏంటో సింపుల్‌గా చూద్దాం. అకౌంట్ క్లోజ్ చేయాలని నిర్ణయించుకున్నాక, ముందుగా అందులో ఉన్న బ్యాలెన్స్‌ను వేరే అకౌంట్‌లోకి మార్చుకోండి. అయితే, అకౌంట్‌లో కనీసం వంద రూపాయల లోపు ఉంచడం మంచిది, ఎందుకంటే క్లోజ్ చేసే సమయంలో ఏవైనా చిన్న చిన్న పెండింగ్ ఛార్జీలు ఉంటే బ్యాంక్ వారు అక్కడే సర్దుబాటు చేస్తారు. అలాగే, మీ అకౌంట్ స్టేట్‌మెంట్ కావాలనుకుంటే క్లోజ్ చేయకముందే డౌన్‌లోడ్ చేసుకోండి. అకౌంట్ క్లోజ్ అయ్యాక స్టేట్‌మెంట్ రావడం కష్టం. మనం చేసే అతి పెద్ద తప్పు ఇక్కడే ఉంటుంది. మన బ్యాంక్ అకౌంట్ నుంచి ఏవైనా మంత్లీ సబ్‌స్క్రిప్షన్లు లేదా లోన్ ఈఎంఐలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు కట్ అవుతుంటే వాటిని వెంటనే వేరే అకౌంట్‌కు లింక్ చేయండి. లేదంటే అకౌంట్ క్లోజ్ చేసే సమయంలో టెక్నికల్ సమస్యలు రావచ్చు. ప్రస్తుతం చాలా బ్యాంకులు అకౌంట్ ఓపెనింగ్ ఆన్‌లైన్‌లో ఇస్తున్నాయి కానీ, క్లోజ్ చేయడానికి మాత్రం నేరుగా బ్రాంచ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మీ హోమ్ బ్రాంచ్‌కు వెళ్లి ‘అకౌంట్ క్లోజర్ ఫామ్‘ అడగండి. అందులో మీ అకౌంట్ నంబర్, ఎందుకు క్లోజ్ చేస్తున్నారో కారణం రాయాలి. మీ దగ్గర ఉన్న చెక్ బుక్, డెబిట్ కార్డ్, పాస్‌బుక్ వంటివి బ్యాంకుకు తిరిగి ఇచ్చేయాలి. సాధారణంగా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసిన 14 రోజుల్లోపు క్లోజ్ చేస్తే ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే అకౌంట్ ఓపెన్ చేసి ఏడాది దాటితే కూడా చాలా బ్యాంకులు ఫీజు వసూలు చేయవు. కానీ, 14 రోజుల నుంచి ఒక ఏడాది లోపు అకౌంట్ క్లోజ్ చేస్తే మాత్రం ‘క్లోజర్ ఛార్జీలు‘ కట్టాల్సి ఉంటుంది. ఇది బ్యాంకుని బట్టి రూ. 200 నుండి రూ. 500 వరకు ఉండవచ్చు. మీరు అప్లికేషన్ ఇచ్చాక బ్యాంక్ వారు ఒక అక్నాలెడ్జ్‌మెంట్ కాపీ ఇస్తారు. దాన్ని జాగ్రత్తగా ఉంచుకోండి. సాధారణంగా 3 నుండి 10 పని దినాల్లో మీ అకౌంట్ శాశ్వతంగా క్లోజ్ అవుతుంది. అకౌంట్ క్లోజ్ అయినట్లు మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు మెసేజ్ లేదా మెయిల్ వస్తుంది. ఇలా పద్ధతి ప్రకారం చేస్తే భవిష్యత్తులో ఎలాంటి ఫైనాన్షియల్ ఇబ్బందులు ఉండవు.

# అంతర్జాతీయ రాజకీయ వేదికపై చోటుచేసుకున్న అనూహ్య మార్పులు





భారత స్టాక్ మార్కెట్లలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. ముఖ్యంగా అమెరికా, ఇరాన్‌లు తమ మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి, ఒక ఒప్పందానికి దగ్గరవుతున్నాయనే వార్తలు ప్రపంచ విపణిని ఒక్కసారిగా ప్రభావితం చేశాయి. ఈ సానుకూల సంకేతాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పతనం కావడంతో, ట్రేడింగ్ ద్వితీయార్థంలో దేశీయ మార్కెట్లు రాకెట్‌లా దూసుకుపోయాయి. గత కొన్ని రోజులుగా ఉద్రిక్తతలతో ఉన్న పెట్టుబడిదారులు, చమురు ధరల తగ్గుదలతో ఊపిరి పీల్చుకోవడమే కాకుండా రిస్క్ తీసుకోవడానికి సిద్ధపడటంతో మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేశాయి. సూచీల గమనాన్ని గమనిస్తే.. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 77,424.36 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైంది. రోజంతా సానుకూల ధోరణిలోనే సాగిన ఈ సూచీ, ఒక దశలో గరిష్టంగా 78,022.78 పాయింట్లను తాకింది. చివరగా సెన్సెక్స్ 940.73 పాయింట్లు పెరిగి 77,958.52 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా అద్భుతమైన పనితీరును కనబరిచింది. 24,171.00 వద్ద ప్రారంభమైన ఈ సూచీ, రోజంతా కొనుగోళ్ల మద్దతుతో 24,356.50 గరిష్ట స్థాయిని చేరుకుంది. మార్కెట్ ముగిసే సమయానికి నిఫ్టీ 298.15 పాయింట్ల లాభంతో 24,330.95 వద్ద ముగిసింది. కేవలం ప్రధాన సూచీలే కాకుండా, విస్తృత మార్కెట్‌లో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కూడా వరుసగా 1.76% మరియు 1.93% లాభపడటం విశేషం. రంగాల వారీగా చూస్తే బ్యాంకింగ్, రియల్టీ రంగాలు మార్కెట్ ర్యాలీని ముందుండి నడిపించాయి. ముఖ్యంగా నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ రంగాలు మెరుగైన వృద్ధిని సాధించాయి. నిఫ్టీ 50 లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి కంపెనీలు అగ్రగామిగా నిలిచాయి. చమురు ధరలు తగ్గడం ఏవియేషన్ రంగానికి కలిసొచ్చే అంశం కావడంతో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లలో భారీ కొనుగోళ్లు కనిపించాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం మాత్రం ఈ ర్యాలీలో వెనుకబడి అత్యంత పేలవమైన పనితీరును కనబరిచింది. ఈ మార్కెట్ పెరుగుదలపై మార్కెట్ విశ్లేషకులు వినోద్ నాయర్ స్పందిస్తూ.. అంతర్జాతీయ కారణాలే ఈ ర్యాలీకి ప్రధాన ప్రభావపు శక్తిగా నిలిచాయని పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు తగ్గడం, చైనా అనుసరిస్తున్న దౌత్యపరమైన చురుకుదనం వల్ల ముడి చమురు ధరలు నియంత్రణలోకి వచ్చాయని ఆయన వివరించారు. ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజ్‌లో బ్రెంట్ క్రూడ్ సుమారు 7% తగ్గి బ్యారెల్‌కు 102.24 డాలర్లకు పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట. దీనికి తోడు కృత్రిమ మేధ ఆధారిత టెక్ కంపెనీలు ప్రకటించిన బలమైన ఫలితాలు, డాలర్ బలహీనపడటం వల్ల వర్ధమాన మార్కెట్లలోకి పెరిగిన పెట్టుబడులు వంటివి మన మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. మరోవైపు, నేడు పలు దిగ్గజ కంపెనీలు తమ నాల్గవ త్రైమాసిక ఫలితాలను విడుదల చేస్తుండటంతో ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. బజాజ్ ఆటో, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, పాలీక్యాబ్ ఇండియా వంటి ప్రముఖ సంస్థల ఫలితాలు వెలువడనున్నాయి. ఐపీఓ మార్కెట్‌లో కూడా సందడి కొనసాగుతోంది. బాగ్మనే ప్రైమ్ ఆఫీస్, రికోడ్ స్టూడియోస్ ఐపీఓలకు నేడు చివరి రోజు కాగా, వీటికి పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రస్తుత పరిస్థితుల్లో మౌలిక సదుపాయాల కల్పన, రాజకీయ స్థిరత్వం వంటి అంశాలు అనుకూలంగా ఉన్నప్పటికీ, ముడిసరుకుల ధరల ఒత్తిడి, విదేశీ మారకపు రిస్కులను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసిన కంపెనీలలో మాత్రమే పెట్టుబడి పెట్టడం శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు.

## హీరోల యాటిట్యూడ్‌పై వ్యాఖ్యలు.. అల్లు అర్జున్‌ని కాదంటూ రవిబాబు క్లారిటీ



ఖుజఱ దీుఎబ । తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు రవిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. కథ ఏదైనా సరే దానికి వినూత్న ట్రీట్‌మెంట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా తన ముద్ర వేసిన రవిబాబు.. తాజాగా 'రేజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రేజర్ మే 8న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్లలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ, "ఒక్క హిట్ వచ్చినా హీరోల బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది. కళ్లజోడు పెట్టుకుని బిల్డప్పులు కొడతారు" అని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యలు నేరుగా అల్లు అర్జున్‌ని ఉద్దేశించి చేసినవేనని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్తో భారీ క్రేజ్ సంపాదించిన అల్లు అర్జున్ ప్రవర్తనను ఉద్దేశించారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన రవిబాబు, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.నేను సోషల్ మీడియాలో లేను. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇండస్ట్రీలో సాధారణంగా జరుగుతున్న విషయాలపై మాత్రమే మాట్లాడాను అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అల్లు అర్జున్ 'పుష్ప 2' ప్రమోషన్ల సమయంలో ఆయన ప్రవర్తనపై సోషల్ మీడియాలో పలు చర్చలు జరిగాయి. 'తగ్గేదేలే' అనే పాత్ర యాటిట్యూడ్‌ను బయట కూడా చూపిస్తున్నారని, కొంతమంది అది అహంకారంగా కనిపిస్తోందని విమర్శించారు.ముంబైలో జరిగిన ప్రెస్ మీట్లలో ఆయన బాడీ లాంగ్వేజ్, సమాధానాల తీరు కూడా ట్రోలింగ్‌కు గురైంది. అలాగే ఆయనను కలవాలంటే కఠిన ప్రోటోకాల్ పాటించాలన్న వార్తలు కూడా వైరల్ అయ్యాయి.వివాదాల్ని పక్కనబెడితే, రవిబాబు ప్రస్తుతం రేజర్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది.అడవి నేపథ్యంలో జరిగే ఈ కథలో, మనుషుల కంటే జంతువులే ఎక్కువ వివేకంతో ప్రవర్తిస్తాయనే కాన్సెప్ట్‌ను చూపించనున్నారు. ముఖ్యంగా సినిమాలో కనిపించే కుక్క పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి వైదీ సంగీతం అందించగా, 'ఫ్లయింగ్ ఫ్రాగ్స్' బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్ కూడా హైలైట్‌గా ఉండనున్నాయి.



## సెయాన్' మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే డివైన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.

గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది. తారాగణం: శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే

## మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్.. కొరటాల శివ సినిమాలో పవర్‌ఫుల్ రోల్!



నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో 'ఎన్టీఆర్ బయోపిక్' (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హై-వోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య 'ఊరమాస్' అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

## 'అమరం' మూవీ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్

తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్ట్రన్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది.వెస్ట్రన్ ఘాట్స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్న ప్రత్యేక యాక్షన్ బ్లాక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బాంబేకు చెందిన మార్షల్ ఆర్ట్స్ టీమ్ సహకారంతో మాస్టర్ మిరాకిల్ మైఖేల్ ఆధ్వర్యంలో మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించారు. లోతైన ప్రేమకథను సిట్యువేషనల్ యాక్షన్‌తో మేళవించి చిత్రాన్ని రూపొందించారు. తేజేష్ తొలి సినిమాకే అద్భుతమైన యాక్షన్ బ్లాక్స్‌లో నటించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొడైకెనాల్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం డాల్ఫిన్ నోస్ వద్ద తెరకెక్కించిన ఒక కీలక సన్నివేశాన్ని ఆయన సింగిల్ టేక్‌లో పూర్తి చేయడం విశేషం. హీరోయిన్‌గా ఐరా అగర్వాల్ నటించగా, నాగినీడు, సాయి ధీనా, జార్జ్ మరియన్, సురేష్ చంద్ర మీనన్, హరీష్ పరాడి తదితరులు కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన తిరువరుల్ కృష్ణన్ గతంలో నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ వద్ద అసోసియేట్‌గా పనిచేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, 'వడచెన్నై', 'అసురన్' చిత్రాలకు ఎడిటింగ్ చేసిన రామర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కొత్త సినిమాటోగ్రాఫర్ భరత్ విజువల్స్ అందించారు.ఈ చిత్రంలో ఐదు పాటలు ఉండగా, వాటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బూపతి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన రాజు సుందరం, ప్రభుదేవా మాస్టర్లకు సన్నిహిత సహాయ కుడిగా మంచి గుర్తింపు పొందారు. కొడైకెనాల్‌లో ఆర్ట్ డైరెక్టర్ జనా సర్ రూపొందించిన భారీ సెట్‌లో ఓ ప్రత్యేక ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాటలో కేరళకు చెందిన 60 మంది డ్యాన్సర్లు పాల్గొనడం విశేషం. మిక్కీ జే మేయర్ అందించిన ఈ ఫోక్ నెంబర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేర్వేరు సామాజిక వర్గాల నుంచి వచ్చిన ఓ జంట అనుకోని పరిస్థితుల్లో చేసే ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలతో సినిమా ఉత్కంఠభరితంగా సాగనుంది.



## 'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా.. ఆ సినిమాతో పోల్చొద్దు : లావణ్య త్రిపాఠి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ యాక్షన్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.